# శుభోదయం!

ప్రతీ అక్షరం..ప్రజా సమరం......!

WWW.SUBHODAYAMDAILY.COM

తెలంగాణ | సంపుటి : 2 | సంచిక : 185 | ఎడిటర్ : వి. శ్రీనివాసరావు | పేజీలు :8 | శుక్రవారం 26 సెప్టెంబర్ 2025




## మెట్రో నష్టాలు.. తెలంగాణ ప్రభుత్వమే తేల్చుకోవాలి

- శ్రీశైలం ఎలివేటెడ్ కారిడార్ నిర్మాణానికి కేంద్రం ముందుకొచ్చింది
- దీనిపై త్వరలోనే నిర్ణయం తీసుకుంటాం
- ఆర్ఆర్ఆర్, మెట్రో విషయంలో ప్రోయాక్టివ్‌గా వ్యవహరించాం
- హైదరాబాద్ మెట్రో ఇప్పటికే నష్టాల్లో నడుస్తోంది
- కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి

ఢిల్లీ

హైదరాబాద్–శ్రీశైలం మార్గంలో 4 లేన్ల ఎక్స్‌ప్రెస్ హైవే నిర్మాణం చేపట్టనున్నట్లు కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి తెలిపారు. పర్యావరణానికి, వన్యప్రాణులకు ఎలాంటి నష్టం లేకుండా హైవేల నిర్మాణం చేపడతామన్నారు. దిల్లీలో ఆయన మీడియాతో - మిగతా3లో

## భారీ వర్షాలున్నాయి.. అప్రమత్తంగా ఉండండి

- మోస్తరు నుంచి భారీ వర్షాలు పడే అవకాశముంది
- అన్ని జిల్లాల కలెక్టర్లు హై అలెర్ట్‌గా ఉండి పరిస్థితిని సమీక్షించాలి
- అవసరమైతే లోతట్టు ప్రాంతాల ప్రజలను ముందుగానే ఖాళీ చేయించి, పునరావాస కేంద్రాలకు తరలించాలి
- రోడ్లపై వరద నీరు నిలిచే ప్రాంతాలను గుర్తించి ముందస్తుగానే ట్రాఫిక్‌ను క్లియర్ చేయాలి



హైదరాబాద్

తెలంగాణలో రానున్న రెండ్రోజులపాటు భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ హెచ్చరించింది. ఈ నేపథ్యంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్ని శాఖల అధికారులను అప్రమత్తం చేశారు. వర్షాలపై నిరంతరం మానిటర్ చేయాలని సూచించారు. మోస్తరు నుంచి భారీ వర్షాలు పడే అవకాశముందని, నిరంతరం జాగ్రత్తగా ఉండాలని అధికారులను రేవంత్ ఆదేశించారు. అన్ని జిల్లాల కలెక్టర్లు హై అలెర్ట్‌గా ఉండి పరిస్థితిని సమీక్షించాలని కోరారు. అవసరమైతే లోతట్టు ప్రాంతాల ప్రజలను ముందుగానే ఖాళీ చేయించి, పునరావాస కేంద్రాలకు తరలించాలని సూచించారు. అన్ని కాజ్‌వేలను పరిశీలించాలని, రోడ్లపై వరద నీరు నిలిచే ప్రాంతాలను గుర్తించి ముందస్తుగానే ట్రాఫిక్‌ను క్లియర్ చేయాలన్నారు. విద్యుత్ శాఖ ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని అంతరాయం లేకుండా కరెంట్ సరఫరా ఉండేలా చర్యలు చేపట్టాలన్నారు. వేలాడే వైర్లను తొలగించటంతో పాటు, ఎలాంటి ప్రాణాపాయం జరగకుండా చూడాలన్నారు. దసరా సెలవులు - మిగతా3లో



## ఆ మూడు రాష్ట్రాలపై బీజేపీ నజర్..

- నూతన నియామకాలతో ఎన్నికల వ్యూహం
- భాజపా ఇన్‌ఛార్జిల నియామకం
- పశ్చిమ బెంగాల్, తమిళనాడు రాష్ట్రాలకు వచ్చే ఏడాది మార్చి– ఏప్రిల్‌లో ఎన్నికలు జరిగే అవకాశాలు



## వందే భారత్ రైళ్లు వచ్చేస్తున్నాయ్..!

- అక్టోబర్ 15న దూసుకెళ్లనున్న లగ్జరీ రైలు..!
- దేశవ్యాప్తంగా వివిధ మార్గాల్లో ఈ రైళ్లు దూసుకెళ్తున్నాయి.
- ఈ రైలు ట్రయల్ రన్‌ను సైతం వివిధ మార్గాల్లో విజయవంతంగా నిర్వహించింది
- స్లీపర్ రైళ్ల కార్యకలాపాలు అక్టోబర్ 15 తర్వాత ప్రారంభమవుతాయి



## దోపిడీని అరికట్టామనే కాంగ్రెస్‌కు కోపం

- పౌరులను దోపిడీ చేయడంలో కాంగ్రెస్ బిజీగా ఉండేది
- వారు దేశ ప్రజలను దోచుకున్నారు
- నాటి రోజుల్లో పన్నులు, ద్రవ్యోల్బణం విపరీతంగా పెరిగింది
- మా ప్రభుత్వం వచ్చి, కాంగ్రెస్ దోపిడీని అడ్డుకుంది
- దేశాన్ని పన్నులు, టోల్ సంకెళ్ల నుండి విముక్తి చేశాం
- ఇప్పుడు, నవరాత్రి తొలి రోజున జీఎస్‌టీ సంస్కరణలు అమలయ్యాయి

## బై ఎలక్షన్స్ లేనట్టే



- భారాస ఎమ్మెల్యేలు కాంగ్రెస్ లో చేరడం అనేది జరగనేలేదు
- కండువాలు కప్పినంత మాత్రాన పార్టీ మారినట్టు పరిగణించడానికి లేదని సాక్షాత్తూ ముఖ్యమంత్రి చెబుతున్నారు.
- అయినా సరే.. స్పీకరు ఎలాంటి నిర్ణయం తీసుకుంటారో వేచి చూడాల్సి ఉన్నదని రేవంత్ అంటున్నారు

హైదరాబాద్

తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఒక క్లారిటీ ఇచ్చేశారు. భారాస ఎమ్మెల్యేలు కాంగ్రెస్ లో చేరడం అనేది జరగనేలేదని.. కండువాలు కప్పినంత మాత్రాన పార్టీ మారినట్టు పరిగణించడానికి లేదని సాక్షాత్తూ ముఖ్యమంత్రి చెబుతున్నారు. అయినా సరే.. స్పీకరు ఎలాంటి నిర్ణయం తీసుకుంటారో వేచి చూడాల్సి ఉన్నదని రేవంత్ అంటున్నారు. ఒకసారి రేవంత్ రెడ్డి.. 'కండువాలు కప్పడం పార్టీ మారినట్టు కాదు' అనే మాటలద్వారా సంకేతాలు స్పష్టంగా ఇచ్చిన తర్వాత.. ఆయన పార్టీకే చెందిన స్పీకరు భిన్నమైన నిర్ణయం తీసుకుంటారని అనుకోవడం భ్రమ.భారత రాష్ట్ర సమితి నాయకులు చెబుతున్నది ఒక్కటే. 'వారు పార్టీ మారారు' అనే సంగతి అందరికీ తెలుసు.. కండువాలు కప్పడం కూడా పార్టీ మారడం కాదు– అంటే జనం నవ్వుతున్నారు– అని వాళ్లు వాదిస్తున్నారు. వాళ్లు పార్టీ మారడం నిజమే కావచ్చు, తాము పార్టీ మారలేదని రేవంత్ రెడ్డి కప్పినవి కాంగ్రెస్ కండువాలు కాదు జాతీయ జెండా రంగులున్న - మిగతా3లో



## హైడ్రోజన్ భవిష్యత్ ఇంధనం

- కేంద్రమంత్రి హర్దీప్ సింగ్ పూరీ
- 2030 నాటికి భారత్ ఏటా 5 మిలియన్ టన్నుల గ్రీన్ హైడ్రోజన్‌ను ఉత్పత్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకుంది
- దీనికి బలమైన పాలసీతో పాటు రూ.19,700 కోట్ల విలువైన ఉత్పత్తి– సంబంధిత ప్రోత్సాహక పథకం మద్దతు ఇస్తుంది
- 2020 నాటికి 10శాతం బయోఫ్యూయల్ బ్లెండింగ్ లక్ష్యాన్ని నిర్దేశించుకున్నాం
- తాము ఐదునెలల ముందుగానే లక్ష్యాన్ని సాధించాం

## కేటీఆర్ అరెస్ట్ తప్పదు.. కవిత పంచాయతీ వేరే అంశం

- 'తెలంగాణలో ఏడాది కాలంలో ఎంతో పని చేశాం
- గాంధీ భవన్‌లో మంత్రుల ముఖాముఖి కార్యక్రమం బాగా జరుగుతోంది
- సంక్షేమం, అభివృద్ధి చేస్తున్నాం
- జూబ్లీహిల్స్‌లో సామాజికవర్గం కాకుండా గెలుపు లక్ష్యం
- సర్వేల్లో ఎవరు ముందుంటే వారికే టికెట్ దక్కుతుంది
- టీపీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్



ఢిల్లీ

జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలో కాంగ్రెస్ పార్టీదే విజయమని టీపీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్ చెప్పుకొచ్చారు. సర్వేలో ఎవరు ముందుంటే వారికే సీటు అని క్లారిటీ ఇచ్చారు. కల్వకుంట్ల కవితది ఆస్తుల పంచాయతీ.. ఆమెకు ప్రజల్లో ఏం ఇమేజ్ ఉందని ప్రశ్నించారు. ఫార్ములా ఈ రేసు కేసులో కేటీఆర్ అరెస్ట్ తప్పదు అంటూ ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. టీపీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్ ఢిల్లీలో మీడియా చిట్‌చాట్‌లో మాట్లాడుతూ.. 'తెలంగాణలో ఏడాది కాలంలో ఎంతో పని చేశాం. గాంధీ భవన్‌లో మంత్రుల ముఖాముఖి కార్యక్రమం బాగా జరుగుతోంది. సంక్షేమం, అభివృద్ధి చేస్తున్నాం. జూబ్లీహిల్స్‌లో సామాజికవర్గం కాకుండా గెలుపు లక్ష్యం. నియోజకవర్గంలో సర్వేలు జరుగుతున్నాయి. సర్వేల్లో ఎవరు ముందుంటే వారికే టికెట్ దక్కుతుంది. అక్టోబర్ నాలుగో తేదీన 22 మంది - మిగతా3లో

# దోపిడీని అరికట్టామనే కాంగ్రెస్‌కు కోపం

**బన్స్వారా:** '11 ఏళ్ల క్రితం కాంగ్రెస్ పాలనలో పరిస్థితులు ఎలా ఉండేవో మీకు తెలుసు. పౌరులను దోపిడీ చేయడంలో కాంగ్రెస్ బిజీగా ఉండేది. వారు దేశ ప్రజలను దోచుకున్నారు. నాటి రోజుల్లో పన్నులు, ద్రవ్యోల్బణం విపరీతంగా పెరిగింది. మా ప్రభుత్వం వచ్చి, కాంగ్రెస్ దోపిడీని అడ్డుకుంది. వారి కోపానికి కారణం కూడా ఇదే. 2017లో మేము జీఎస్టీని తీసుకువచ్చాం. దేశాన్ని పన్నులు, టోల్ సంకెళ్ల నుండి విముక్తి చేశాం. ఇప్పుడు, నవరాత్రి తొలి రోజున జీఎస్టీ సంస్కరణలు అమలయ్యాయి. దేశం 'జీఎస్టీ బచత్ ఉత్సవ్' జరుపుకుంటోంది' అని ప్రధాని మోదీ రాజస్థాన్‌లోని బన్స్వారాలో జరిగిన బహిరంగ ర్యాలీలో పేర్కొన్నారు. గురువారం రాజస్థాన్‌లో పర్యటించిన ప్రధానిమోదీ రూ.1,22,100 విలువైన బహుళ అభివృద్ధి ప్రాజెక్టులకు శంకుస్థాపన చేశారు. బన్స్వారాలో జరిగిన బహిరంగ సభలో ప్రసంగించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 'విద్యుత్ ప్రాముఖ్యతను కాంగ్రెస్ ఎప్పుడూ పట్టించుకోలేదు. 2014లో నాకు సేవ చేసే అవకాశం వచ్చినప్పుడు, దేశంలో 2.5 కోట్ల ఇళ్లకు విద్యుత్



కనెక్షన్ లేదు. స్వాతంత్ర్యం వచ్చి 70 ఏళ్లు గడిచినా, 18 వేల గ్రామాలలో ఇప్పటికీ విద్యుత్ కనెక్షన్లు లేవు. ప్రధాన నగరాలు గంటల తరబడి విద్యుత్ కోతలను ఎదుర్కొన్నాయి. గ్రామాల్లో 4-5 గంటల విద్యుత్ సరఫరాతో రోజు గడిచేది. 2014లో మా ప్రభుత్వం ఈ పరిస్థితిని మార్చాలని నిర్ణయించుకుంది. భారతదేశంలోని ప్రతి గ్రామానికి విద్యుత్ అందించాం. మేము 2.5 కోట్ల ఇళ్లకు ఉచిత విద్యుత్ కనెక్షన్లు ఇచ్చాం. నవరాత్రులలోని 4వ రోజున మాతా త్రిపుర సుందరి భూమి అయిన బన్స్వారానికి వచ్చే అవకాశం లభించింది. అమ్మవారికి హృదయపూర్వకంగా నమస్కరిస్తున్నాను' అని అన్నారు.

ప్రధానమంత్రి నరేంద్ర మోదీ గురువారం గ్రేటర్ నోయిడాలో ఉత్తరప్రదేశ్ అంతర్జాతీయ వాణిజ్య ప్రదర్శన-2025ను ప్రారంభించారు. ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ నాయకత్వంలో జరిగే ఈ మెగా ఈవెంట్ సెప్టెంబర్ 25 నుండి 29 వరకు జరగనుంది. దీనిలో ఉత్తరప్రదేశ్ పారిశ్రామిక, వ్యవసాయ, సాంస్కృతిక, ఆవిష్కరణలు ప్రదర్శితం కానున్నాయి. అనంతరం ప్రధాని మోదీ రాజస్థాన్‌ను సందర్శించి, బన్స్వారాలో జరిగిన బహిరంగ సభలో ప్రసంగించారు. పీఎం కుసుమ్ లబ్ధిదారులతో కూడా ఆయన సంభాషించారు. రూ.42,000 కోట్ల విలువైన అణుశక్తి విద్యుత్ ప్రాజెక్టుకు ప్రధానమంత్రి శంకుస్థాపన చేశారు. ఇది దేశంలోని భారీ అణు విద్యుత్ కేంద్రాలలో ఒకటిగా నలిచిపోనుంది.

# వందే భారత్ రైళ్లు వచ్చేస్తున్నాయ్!


భారతీయ రైల్వేశాఖ ప్రతిష్టాత్మకంగా వందే భారత్ ఎక్స్‌ప్రెస్ రైళ్లను ప్రవేశపెట్టింది. దేశవ్యాప్తంగా వివిధ మార్గాల్లో ఈ రైళు దూసుకెళ్తున్నాయి. ప్రయాణికుల నుంచి సెమీ హైస్పీడ్ రైళ్లకు ఆదరణ లభిస్తున్నది. ఈ నేపథ్యంలో భారతీయ రైల్వేశాఖ సరికొత్తగా అంతర్జాతీయ సదుపాయాలతో వందే భారత్ స్లీపర్ వెర్షన్ రైళ్లను ప్రవేశపెట్టబోతున్నది. ఈ రైలు ట్రయల్ రన్‌ను సైతం వివిధ మార్గాల్లో విజయవంతంగా నిర్వహించింది. తాజాగా వందే భారత్ స్లీపర్ వెర్షన్‌పై కేంద్ర రైల్వేశాఖ మంత్రి అశ్విని వైష్ణవ్ కీలక అప్‌డేట్ అందించారు. స్లీపర్ రైళ్ల కార్యకలాపాలు అక్టోబర్ 15 తర్వాత ప్రారంభమవుతాయని తెలిపారు. రెండు రేక్ డిలివరీల కోసం భారత రైల్వేలు నిరీక్షిస్తున్నాయని.. ఈ క్రమంలో ప్రారంభోత్సవంలో కాస్త ఆలస్యం జరుగుతోందన్నారు. ఒకేసారి రెండు స్లీపర్ రైళ్లను ప్రారంభించాలని భావిస్తున్నామన్నారు. అవి రోజువారీ సేవల కోసం ఉద్దేశించినవని.. రెండు రేక్‌లు సిద్ధంగా ఉండాలన్నారు. రెండో రైలు అక్టోబర్ 15 నాటికి వచ్చే అవకాశం ఉందని తెలిపారు. అత్యాధునిక సదుపాయాలు, మెరుగైన భద్రత, ప్రయాణికులకు అనుకూలమైన సౌకర్యాలతో వందే భారత్ స్లీపర్ వెర్షన్‌ను రైల్వేశాఖ తీసుకువస్తున్నది. తొలి రైలు ఢిల్లీ-పాట్నా మధ్య రాకపోకలు సాగించనున్నది. ప్రస్తుతం రెండు ప్రాంతాల మధ్య ప్రయాణానికి 12నుంచి17 గంటల పడుతుందని.. స్లీపర్ వెర్షన్ అందుబాటులోకి వస్తే 11 గంటలకు తగ్గుతుందని భావిస్తున్నారు. ప్రోటోటైప్ వందే భారత్ స్లీపర్ రైలు 800 నుంచి 1200 కిలోమీటర్ల సుదూర ప్రాంతాలకు రాత్రిపూట ప్రయాణాల కోసం రైల్వేశాఖ తీర్చిదిద్దింది. ఇందులో 16 నుంచి 20 కోచ్‌లు ఉండనున్నాయి. ఫస్ట్ ఏసీ, సెకండ్ ఏసీ, థర్డ్ ఏసీతో పాటు రెండు జనరల్ ఫస్ట్ ఏసీ, సెకండ్, థర్డ్ కాకుండా, రెండు సీటింగ్ కం లగేజీ కోచ్‌లు సైతం ఉంటాయి. రైలులో దాదాపు 820 నుంచి



1200 మంది వరకు ప్రయాణం చేయొచ్చు. గంటకు 160 కిలోమీటర్ల వేగంతో దూసుకెళ్తుంది. భద్రతతో పాటు, స్లీపర్ వెర్షన్‌లో యూఎస్‌బీ ఛార్జింగ్‌తో కూడిన ఇంటిగ్రేటెడ్ రీడింగ్ లైట్లు, పబ్లిక్ అనౌన్స్‌మెంట్, విజువల్ ఇన్ఫర్మేషన్ సిస్టమ్స్, మాడ్యులర్ ప్యాంట్రీలు, దివ్యాంగ ప్రయాణికుల కోసం ప్రత్యేక బెర్త్‌లు, టాయిలెట్స్ తదితర ప్రపంచస్థాయి సౌకర్యాలు ఉండనున్నాయి. మొదటి ఏసీ కోచ్‌లో వేడినీటితో కూడిన షవర్లు సైతం ఉంటాయి. సుదీర్ఘ ప్రయాణాల్లో ప్రయాణీకుల సౌకర్యాన్ని మెరుగుపరుచనున్నాయి. మధ్యతరగతి కోసం ఉద్దేశించిన రైలని.. ఛార్జీలు రాజధాని ఎక్స్‌ప్రెస్‌తో సమానంగా ఉంటాయని గతంలో కేంద్ర రైల్వేశాఖ మంత్రి అశ్వినీ వైష్ణవ్ తెలిపారు. వందే భారత్ స్లీపర్ రైళ్లు సౌకర్యవంతమైన, సరసమైన ప్రయాణ అనుభవాన్ని అందించడమే రైల్వేశాఖ లక్ష్యంగా పెట్టుకుందని ఆయన వివరించారు. అయితే, వందే భారత్ స్లీపర్ రైలును దేశవ్యాప్తంగా వివిధ నగరాల మధ్య నడిపేందుకు రైల్వేలు ప్రయత్నాలు చేస్తున్నాయి. న్యూఢిల్లీ-సికింద్రాబాద్, న్యూఢిల్లీ-హౌరా, ఢిల్లీ-పుణే, ముంబయి-ఢిల్లీ నగరాలను కలుపుతూ రైలు నడుపనున్నట్లు వార్తలు వచ్చాయి. తాజాగా పట్నా-ఢిల్లీ మధ్య స్లీపర్ రైలును ప్రారంభించేందుకు కేంద్రం ఏర్పాట్లు చేసింది.

# తేజస్ మార్క్-2కు అమెరికా ఇంజిన్లు లేనట్లేనా?

**ఇంటర్నెట్‌డెస్క్:** భారత్ దేశీయంగా అభివృద్ధి చేసిన ఫైటర్ జెట్ తేజస్ మార్క్-2కు అమెరికా తయారీ జీఈ ఎఫ్-414 ఇంజిన్లను అమర్చకపోవచ్చన్న ప్రచారం జోరందుకొంది. అగ్రరాజ్యం నుంచి సరఫరాలు మందగించిన నేపథ్యంలో ఫ్రాన్స్‌కు చెందిన శాఫ్రాన్ ఎస్‌ఏతో కలిసి భారత్‌లో ఇంజిన్‌ను అభివృద్ధి చేయడంపై చర్చలు జోరందుకొన్నట్లు బ్లూమ్‌బెర్గ్ కథనంలో పేర్కొంది. అయితే భారత్ ఆ కంపెనీ నుంచి ఇంజిన్లను నేరుగా కొనుగోలు చేస్తుందా..? లేదా సంయుక్తంగా అభివృద్ధి చేస్తుందా అనే దానిపై స్పష్టత రాలేదని భారత్‌కు చెందిన అధికారులు వెల్లడించినట్లు సదరు పత్రిక పేర్కొంది. భారత్‌కు చెందిన తేలికపాటి యుద్ధవిమానం తేజస్‌కు ఆధునిక వెర్షన్ మార్క్-2. వాస్తవానికి ఫైటర్ జెట్‌కు ఇంజిన్ కోసం బైడెన్ అమెరికా అధ్యక్షుడిగా ఉన్న సమయంలో ఇరు దేశాల మధ్య ఒప్పందం జరిగింది. దీని ప్రకారం జీఈ-414 రకం ఇంజిన్లను భారత్‌లోనే సంయుక్తంగా తయారు చేసేలా సంతకాలు జరిగాయి. కానీ, ఇటీవల ఇరు దేశాల మధ్య అభిప్రాయ భేదాలు తీవ్రం అయ్యాయి. దీంతో ఇంజిన్ల తయారీపై చర్చలు మందగించాయి. వాయుసేనలో రిటైర్మెంట్‌కు దగ్గరపడిన జాగ్వర్, మిరాజ్-2000 ఫైటర్‌జెట్లను 200 తేజస్‌లతో భర్తీ చేయాలన్నది ప్రణాళిక. పాక్‌తో సైనిక ఘర్షణ తర్వాత వేగంగా తన రక్షణ సామర్థ్యాలను పెంచుకోవడంపై భారత్ కసరత్తు చేస్తోంది. బ్లూమ్‌బెర్గ్ కథనంపై భారత రక్షణ శాఖ



స్పందించలేదు. రష్యా నుంచి చమురు కొనుగోలు చేస్తోందంటూ భారత్‌పై ట్రంప్ సర్కారు 25శాతం అదనపు టారిఫ్‌లను విధించిన విషయం తెలిసిందే. ఆ తర్వాత చాబహార్ పోర్టుకు ఇచ్చిన మినహాయింపులను తొలగించింది. హెచ్-1బీ వీసాల ఫీజును పెంచింది. తాజాగా విమాన ఇంజిన్ల డీల్‌పై నీలి నీడలు కమ్ముకొన్నాయి.

## నికోలస్ సర్కోజీకి అయిదేళ్ల జైలుశిక్ష

**పారిస్:** ఫ్రాన్స్ మాజీ అధ్యక్షుడు నికోలస్ సర్కోజీకి అయిదేళ్ల శిక్ష పడింది. పారిస్ కోర్టు ఈ శిక్షను ఖరారు చేసింది. ఆయనకు లక్ష యూరోల జరిమానా కూడా విధించారు. అక్రమ రీతిలో లిబియా నుంచి నిధులు తీసుకున్నట్లు సర్కోజీపై ఆరోపణలు ఉన్నాయి. నేరపూరిత కుట్రకు పాల్పడినట్లు పారిస్ కోర్టు తన తీర్పులో వెల్లడించింది. లిబియా నేత మొహమ్మద్ గడ్డాఫీ నుంచి



అక్రమంగా నిధులను సేకరించి 2007 దేశాధ్యక్ష ఎన్నికల్లో సర్కోజీ పోటీ చేసి గెలిచినట్లు ఆరోపణలు ఉన్నాయి. %2007 నుంచి 2012 వరకు ఫ్రాన్స్ అధ్యక్షుడిగా సర్కోజీ చేశారు. అయితే అనేక కేసుల్లో సర్కోజీని నిర్దోషిగా తేల్చింది కోర్టు. 2005 నుంచి 2007 మధ్య అవినీతికి పాల్పడిన కేసులో సర్కోజీపై నేరపూరిత కుట్ర అభియోగాలను మోపారు. సర్కోజీ వయసు 70 ఏళ్లు. పారిస్ కోర్టు తీర్పుకు వ్యతిరేకంగా ఆయన అప్పీల్ చేసే అవకాశం ఉన్నది. తన వయసు దృష్ట్యా షరతులతో విడుదల చేసే అంశాన్ని ప్రస్తావించనున్నారు. ఫ్రాన్స్‌లో దేశాధ్యక్షుడికి శిక్ష పడడం ఇదే మొదటిసారి.

## ఆన్‌లైన్ స్టోర్ నుంచి ఫోన్ ఛార్జర్లు: పహల్గాం ఉగ్రవాదుల కొనుగోళ్లు

**ఇంటర్నెట్‌డెస్క్:** పహల్గాం దాడికి పాల్పడిన ఉగ్రవాదులు ఆన్‌లైన్ ప్లాట్‌ఫామ్‌లను వాడుకొని తమకు అవసరమైన పరికరాలు కొనుగోలు చేసినట్లు దర్యాప్తు సంస్థలు గుర్తించాయి. తాజాగా ఉగ్రమూకకు సాయం చేసిన ఒక ఓవర్ గ్రౌండ్ వర్కర్ (ఓజీడబ్ల్యూ)ను దర్యాప్తు బృందాలు అదుపులోకి తీసుకొన్నాయి. అతడి నుంచి కీలక సమాచారం బయటకు వచ్చింది. "ఆపరేషన్ మహాదేవ్ సమయంలో మూడు మొబైల్ ఛార్జర్లను ఎన్‌కౌంటర్ జరిగిన స్థలం నుంచి స్వాధీనం చేసుకొన్నాం. ఆ తర్వాత దర్యాప్తులో జరిగిన టెక్నికల్ వెరిఫికేషన్‌లో వీటిల్లో ఒక ఛార్జర్ ఓ ఫోన్‌తో పాటు వచ్చినట్లు గుర్తించాము" అని పోలీసు అధికారి ఒకరు వెల్లడించారు. దీనిని ఓ ఆన్‌లైన్ ప్లాట్‌ఫామ్‌పై కొనుగోలు చేసినట్లు గుర్తించామన్నారు. దీనిని స్థానికంగా ఉండే ఇక్బాల్ కంప్యూటర్స్‌కు చెందిన ముసాయిబ్ అహ్మద్ చోపాన్ అనే వ్యక్తి కొనుగోలు చేసినట్లు గుర్తించారు. ఆ తర్వాత తాను దానిని ఎండీ యూసఫ్ కటారికి విక్రయించినట్లు ముసాయిబ్ అహ్మద్ అంగీకరించాడు. ఇక యూసఫ్‌ను దర్యాప్తు అధికారులు ఇంటరాగేషన్ చేయగా.. తానే డాచిగావ్ అడవుల్లో దాగిన ఉగ్రవాదులకు వాటిని అందజేసినట్లు అంగీకరించాడు. ఈ దాడి కేసులో ఉగ్రవాదులకు అవసరమైన వస్తువులు అందజేసినందుకు జమ్మూకశ్మీర్‌లోని కుల్గాం జిల్లాకు చెందిన మహ్మద్ యూసఫ్ కటారి(26) అరెస్టు చేశారు.


## ఆ మూడు రాష్ట్రాలపై బీజేపీ నజర్




**ఇంటర్నెట్ డెస్క్:** త్వరలో బిహార్ అసెంబ్లీ ఎన్నికలు జరగనున్నాయి. ఈ నేపథ్యంలో బిహార్‌తోపాటు వచ్చే ఏడాది ఎన్నికలు జరగనున్న పశ్చిమ బెంగాల్, తమిళనాడు రాష్ట్రాలకు పార్టీ తరపున భాజపా కీలక నియామకాలు చేపట్టింది. బిహార్ ఎన్నికల ఇన్‌ఛార్జిగా కేంద్రమంత్రి ధర్మేంద్ర ప్రధాన్‌ను నియమించింది. కేంద్ర మంత్రి సీఆర్ పాటిల్, ఉత్తర్‌ప్రదేశ్ డిప్యూటీ సీఎం కేశవ్ ప్రసాద్ మౌర్యలకు సహాయ ఇన్‌ఛార్జిలుగా బాధ్యతలు అప్పగించింది. సీఆర్ పాటిల్ ప్రస్తుతం భాజపా గుజరాత్ అధ్యక్షుడిగానూ ఉన్నారు. పశ్చిమ బెంగాల్‌కు కేంద్ర మంత్రి భూపేందర్ యాదవ్‌ను ఇన్‌ఛార్జిగా, త్రిపుర మాజీ సీఎం బిప్లబ్ కుమార్ దేబ్‌ను సహాయ ఇన్‌ఛార్జిగా నియమించింది. పార్టీ జాతీయ ఉపాధ్యక్షుల్లో ఒకరైన బైజయంత్ పాండా తమిళనాడు ఇన్‌ఛార్జిగా బాధ్యతలు నిర్వహించనున్నారు. మురళీధర్ మొహోల్‌ను సహాయ ఇన్‌ఛార్జిగా నియమించారు. తమిళనాడులో అన్నాడీఎంకేతో భాజపా జట్టుకట్టిన విషయం తెలిసిందే. పశ్చిమ బెంగాల్, తమిళనాడు రాష్ట్రాలకు వచ్చే ఏడాది మార్చి- ఏప్రిల్‌లో ఎన్నికలు జరిగే అవకాశాలున్నాయి.

బిహార్‌లో మూడు దశల్లో ఎన్నికలు నిర్వహించే అవకాశాలు ఉన్నట్లు ఇప్పటికే జాతీయ మీడియాలో కథనాలు వెలువడ్డాయి. నవంబర్ 22వ తేదీతో రాష్ట్ర అసెంబ్లీ గడువు ముగియనుంది. ఈ నేపథ్యంలో.. నవంబర్ 5 నుంచి 15వ తేదీ వరకు మూడు విడతల్లో పోలింగ్ జరగొచ్చని అంచనా వేస్తున్నారు. దీనిపై అధికారిక ప్రకటన ఇంకా రావాల్సి ఉంది. 2020లోనూ మూడు విడతల్లో ఎన్నికలు నిర్వహించారు.

## తల్లిదండ్రులను పట్టించుకోకపోతే.. పిల్లల్ని వెళ్లగొట్టొచ్చు



**ఇంటర్నెట్‌డెస్క్:** వృద్ధాప్యంలో ఉన్న తల్లిదండ్రులను పట్టించుకోని పిల్లలకు వారి ఆస్తులను అనుభవించే హక్కు లేదని సుప్రీంకోర్టు మరోసారి స్పష్టం చేసింది. అలా ప్రవర్తించే సంతానాన్ని బయటకు వెళ్లగొట్టొచ్చని తేల్చిచెప్పింది. బిడ్డల నిరాదరణకు గురయ్యే తల్లిదండ్రులకు 2007లో ప్రభుత్వం తీసుకొచ్చిన 'తల్లిదండ్రుల, వృద్ధుల సంరక్షణ, పోషణ చట్టం' అండగా నిలుస్తుందని వ్యాఖ్యానించింది. కుమారుడు తమ సంరక్షణ బాధ్యతలు చూసుకోవడం లేదంటూ మహారాష్ట్రకు చెందిన 80 ఏళ్ల వృద్ధ జంట సుప్రీంకోర్టును ఆశ్రయించగా.. ఈ తీర్పు వెలువడింది. 2023లో ఈ వృద్ధ జంట కుమారుడి నుంచి పోషణ ఖర్చులు, అలాగే తమ ఆస్తులు తమకు చెందేలా చూడాలని కోరుతూ ట్రైబ్యునల్‌ను ఆశ్రయించారు. వారి అభ్యర్థనను పరిశీలించిన ట్రైబ్యునల్.. నెలకు రూ.3000 ఇవ్వాలని, అలాగే ముంబయిలోని వారి ఇంటిని ఖాళీ చేయాలని తీర్పునిచ్చింది. అయితే ముంబయి హైకోర్టు ఆ తీర్పును తోసిపుచ్చింది. 2007 చట్టం ప్రకారం ఆ కుమారుడు కూడా సీనియర్ సిటిజన్ కావడంతో అతడిని ఇంటి నుంచి వెళ్లగొట్టేలా ఆదేశాలు ఇచ్చే న్యాయపరిధి దానికి లేదని పేర్కొంది. అయితే హైకోర్టు పరిగణనలోకి తీసుకున్న కారణం తప్పని సుప్రీం అభిప్రాయం వ్యక్తంచేసింది. ట్రైబ్యునల్ తీర్పును సమర్థించింది. నవంబర్ 30లోగా ఆ కుమారుడు ఇంటిని ఖాళీ చేయాలని గడువు ఇచ్చింది. గతంలోనూ కోర్టు ఈ తరహా తీర్పునిచ్చింది. జన్మనిచ్చిన తల్లిదండ్రుల సంరక్షణ, పోషణ బాధ్యత వారి కుమారులు, కుమార్తెలదేనని స్పష్టం చేసిన సంగతి తెలిసిందే. ఆ బాధ్యతను విస్మరించిన వారికి కన్నవారి ఆస్తిని పొందే హక్కులేదని తేల్చి చెప్పింది. వృద్ధాప్యంలో అమ్మానాన్నల బాగోగులన్నీ చూసుకుంటానని హామీనిచ్చి, వారి నుంచి ఆస్తి పొందిన కుమారుడు మాట తప్పడంతో మధ్యప్రదేశ్‌కు చెందిన తల్లిదండ్రులు సుప్రీంను ఆశ్రయించారు. ఆ కుమారుడికి ఇచ్చిన గిఫ్ట్ డీడ్‌ను రద్దుచేసి ఆ ఆస్తిపై వృద్ధుల హక్కును పునరుద్ధరించింది. తల్లిదండ్రుల సంరక్షణ, పోషణ చట్టం ప్రకారం.. ఏర్పాటైన ట్రైబ్యునళ్లు... కన్నవారిని పట్టించుకోని బిడ్డల విషయంలో సత్వర విచారణ జరుపుతాయని తెలిపింది. ఇలాంటి వివాదాల్లో తల్లిదండ్రులు తమ పిల్లలకు బదిలీ చేసిన ఆస్తిపై యాజమాన్య హక్కులు తిరిగి బాధితులకే దక్కేలా ఆదేశించే అధికారం ఆ ట్రైబ్యునళ్లకు ఉంటుందని ధర్మాసనం స్పష్టంచేసింది.

## హైడ్రోజన్ భవిష్యత్ ఇంధనం

హైడ్రోజన్ భవిష్యత్ ఇంధనమని కేంద్ర పెట్రోలియంశాఖ మంత్రి హర్దీప్ సింగ్ పూరీ పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఈ ఇంధనం ప్రాముఖ్యతను మరోసారి నొక్కి చెప్పారు. ఇంధన భద్రత, ఆర్థిక పోటీతత్వం, పర్యావరణ బాధ్యతకు కీలకమైన స్తంభంగా పేర్కొన్నారు. 2030 నాటికి భారత్ ఏటా 5 మిలియన్ టన్నుల గ్రీన్



హైడ్రోజన్‌ను ఉత్పత్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకుందని కేంద్రమంత్రి చెప్పారు. దీనికి బలమైన పాలసీతో పాటు రూ.19,700 కోట్ల విలువైన ఉత్పత్తి-సంబంధిత ప్రోత్సాహక పథకం మద్దతు ఇస్తుందని తెలిపారు. బయోఫ్యూయల్ బ్లెండింగ్‌ను స్వీకరించడం ద్వారా సాధించిన విసయాలపై ఆయన స్పందించారు. 2020 నాటికి 10శాతం బయోఫ్యూయల్ బ్లెండింగ్ లక్ష్యాన్ని నిర్దేశించుకున్నామని.. తాము ఐదునెలల ముందుగానే లక్ష్యాన్ని సాధించామన్నారు. అప్పుడు 20శాతం బయోఫ్యూయల్ బ్లెండింగ్‌ని లక్ష్యాన్ని నిర్దేశించుకున్నాయన్న ఆయన.. తొలి లక్ష్యాన్ని ఐదునెలల ముందుగానే సాధిస్తే.. రెండో లక్ష్యాన్ని ఆరేళ్ల ముందుగానే సాధించామన్నారు. పానిపట్‌లోని ఇండియన్ ఆయిల్ గ్రీన్ హైడ్రోజన్ ప్లాంట్, విశాఖపట్నంలో టోక్యో ఎనర్జీ బిడ్‌లను ఉటంకిస్తూ.. భారత్‌లో హైడ్రోజన్ ఉత్పత్తి ఖర్చులు ఎలా క్రమంగా తగ్గుతున్నాయో మంత్రి వివరించారు. ఇది పెరుగుతున్న పెట్టుబడిదారుల విశ్వాసమని.. సాంకేతిక పరిపక్వతకు సంకేతంగా పేర్కొన్నారు. ఇండియన్ సోలార్ ఎనర్జీ కార్పొరేషన్.. గ్రీన్ అమ్మోనియా టెండర్లను సైతం హెలెట్ చేశారు. సహజ వాయువు కంటే లాజిస్టికల్ ప్రయోజనాలను బట్టి గ్రీన్ అమ్మోనియాను ముఖ్యమైన ఎగుమతి అవకాశంగా మంత్రి అభివర్ణించారు. కేంద్ర మంత్రివర్గం జనవరి 4, 2023న రూ.19,744 కోట్ల వ్యయంతో నేషనల్ గ్రీన్ హైడ్రోజన్ మిషన్‌ను ఆమోదించింది. 2030 నాటికి ఏటా ఐదు ఎంఎంటీ గ్రీన్ హైడ్రోజన్‌ను ఉత్పత్తి చేయడంతో పాటు గ్రీన్ హైడ్రోజన్ ఎగుమతిలో భారత్‌ను ప్రపంచం కేంద్రంగా మార్చాలన్నది ఈ మిషన్ లక్ష్యం.

# కవితకు స్థానిక సంస్థలకు లింక్

**నిజామాబాద్ :** ఎమ్మెల్యేగాని, ఎంపీగాని, ఎమ్మెల్సీగాని రాజీనామా చేస్తే వేరే కారణాలు ఏమీ లేకపోతే వెంటనే స్పీకర్?, చైర్మన్ ?ఆమోదిస్తారు. ఆరు నెలల్లోగా ఎన్నిక నిర్వహిస్తారు. కాని కేసీఆర్? కూతురు కవితది స్పెషల్? కేసు. ఆమె ఎమ్మెల్సీ పదవికి రాజీనామా చేసి చాలా కాలమైనా దాన్ని ఇప్పటికీ శాసన మండలి చైర్మన్? గుత్తా సుఖేందర్?రెడ్డి ఆమోదించలేదు. నిన్న మీడియాకు కూడా తన రాజీనామా ఇంకా ఆమోదించలేదని చెప్పింది. తన రాజీనామా ఆమోదించాలని చైర్మన్?ను మళ్లీ కలుస్తానంది.

పార్టీలో ఏర్పడిన విభేదాల కారణంగా కవిత ఈ నెల 3వ తేదీన బీఆర్ఎస్ పార్టీ ప్రాథమిక సభ్యత్వానికి, ఎమ్మెల్సీ పదవికి రాజీనామా చేసింది. ఆ వెంటనే చైర్మన్ ఫార్మాట్ లో రాజీనామా లేఖను తన అనుచరులతో చైర్మన్ కార్యాలయానికి అందజేసింది. తరువాత కవిత స్వయంగా చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డికి ఫోన్ చేసి, తన రాజీనామాను ఆమోదించాలని కోరింది. దీనిపై స్పందించిన గుత్తా తాను ప్రస్తుతం అందుబాటులో లేనని తర్వాత నిర్ణయం తీసుకుంటానని చెప్పాడు. కాని ఇప్పటికీ రాజీనామా ఆమోదం పొందలేదుకవిత రాజీనామాను చైర్మన్ ?ఎందుకు ఆమోదించలేదన్న విషయం చర్చనీయాంశమైంది. ఎంపీగా పోటీ చేసి ఓడిపోయిన కూతురిని ఎలాగైనా చట్టసభకు పంపాలని తండ్రి కేసీఆర్? అనుకున్నాడు. మార్గం అన్వేషిస్తుంటే స్థానిక సంస్థల కోటా ఎమ్మెల్సీ పదవి ఖాళీగా కనిపించింది. అప్పట్లో అధికారంలో ఉన్న గులాబీ పార్టీ చేతిలోనే స్థానిక సంస్థలు ఉన్నాయి కదా. స్థానిక సంస్థల్లో ఆ పార్టీ హవాయే నడుస్తోంది కదా. అందువల్ల కవిత నిజామాబాద్? స్థానిక సంస్థల ఎమ్మెల్సీగా గెలవడం చాలా ఈజీగా జరిగిపోయింది.ప్రభుత్వం మారినా ఎమ్మెల్సీలకు ముప్పు ఉండదు కాబట్టి కాంగ్రెసు అధికారంలోకి వచ్చినా కవిత ఎమ్మెల్సీగా కొనసాగింది. బీఆర్ఎస్ తరఫున 2016లో



ఎన్నికైన ఎమ్మెల్సీ భూపతిరెడ్డి పార్టీ ఫిరాయింపు కారణంగా అనర్హత వేటుకు గురయ్యాడు. ఆయన పదవీ కాలం 2022 వరకు ఉంది. అయితే.. ఎన్నికైన తర్వాత ఆయన అనుసరించిన తీరుతో పదవి ఊడిపోయింది. ఆయనకున్న పదవీ కాలానికి అనుగుణంగా ఉప ఎన్నికను నిర్వహించారు. ఆ ఎన్నికలో కవిత గెలిచింది.వాస్తవానికి ఈ ఎన్నిక ప్రక్రియ కరోనా కారణంగా ఆలస్యమైంది. కవిత పదవీ కాలం 2028 జనవరి 4వ తేదీ వరకు ఉంది. ఇక కవిత నిజామాబాద్ స్థానిక సంస్థల ఎన్నికల ఎమ్మెల్సీ కావడంతో ఆమె రాజీనామా అంశం ఇంకా పెండింగ్ లోనే ఉండే అవకాశం ఉందని చెబుతున్నారు. ఇందుకు కారణం? ప్రస్తుతం జడ్పీటీసీ, ఎంపీటీసీల పదవులు లేవు కదా. ముందుగా ఆ పదవులకు ఎన్నికలు జరగాల్సి ఉంది. ఆ తరువాతే ఎమ్మెల్సీ ఎన్నిక. మండలి చైర్మన్ కవిత రాజీనామాను ఆమోదిస్తే ఆరు నెలల్లో ఆ స్థానానికి ఉప ఎన్నికలు నిర్వహించాలిఅయితే స్థానిక సంస్థల ఎన్నికలు మరింత ఆలస్యం అయ్యే అవకాశాలు ఉన్నాయనే టాక్ వినిపిస్తోంది. ఈ కారణంతోనే కవిత రాజీనామాను ఆమోదించలేదని తెలుస్తోంది. ఇక కవిత నేరుగా చైర్మన్ ను కలిస్తే రాజీనామాను ఆమోదించక తప్పదు అంటున్నారు. ఆమె త్వరలో చైర్మన్?గుత్తా సుఖేందర్?రెడ్డిని కలుస్తానని చెప్పింది. ఆమె కలిస్తే గుత్తా ఆమోదిస్తాడా? లేదా పరిస్థితి వివరించి పెండింగ్?లో పెడతాడా? చూడాలి.

# సిరిసిల్లలో బూమ్ రాంగ్ అవుతోందా

**కరీంనగర్ :** కొంతకాలంగా సిరిసిల్ల కలెక్టర్ మీద భారత రాష్ట్ర సమితి కార్యనిర్వాహక అధ్యక్షుడు తీవ్ర ఆగ్రహంతో ఉన్నారు. ఆయన ఎప్పుడు సిరిసిల్ల వెళ్ళినా సరే.. తీవ్ర స్థాయిలో మండిపడుతున్నారు. కేటీఆర్ అనుచర వర్గం కూడా ఆ కలెక్టర్ మీద అగ్గిమీద గుగ్గిలం అవుతున్నారు. గులాబీ పార్టీ అధికారంలో ఉన్నప్పుడు సిరిసిల్లలో అడ్డగోలుగా అక్రమాలు జరిగాయని.. ఆ అక్రమాలను ప్రస్తుత సిరిసిల్ల కలెక్టర్ బయట పెడుతున్నారని.. రేవంత్ అందుకోసమే ఆయనను సిరిసిల్ల పంపించారని కాంగ్రెస్ నేతలు చెబుతున్నారు. కేటీఆర్ ఏ స్థాయిలో ఆగ్రహం వ్యక్తం చేసినప్పటికీ.. ఆయన అనుచరులు ఏ స్థాయిలో మండిపడినప్పటికీ అక్కడి కలెక్టర్ మాత్రం తన శైలిని మాత్రం మార్చుకోలేదు. వాస్తవానికి కేటీఆర్ అనుచరులు చేసిన అక్రమాలను బయటికి తీసే క్రమంలో ఆయన అదే దూకుడు కొనసాగించి ఉంటే బాగుండేది. కానీ ఓ నిర్వాసితురాలి విషయంలో ఆయన వ్యవహరించిన తీరు ఏకంగా హైకోర్టు దాకా వెళ్ళింది. ఆయనకు మాత్రమే కాదు.. ప్రభుత్వానికి కూడా మొట్టికాయలు పడేలా చేసింది.సిరిసిల్ల జిల్లా కలెక్టర్ గా సందీప్ కుమార్ ఝూ పనిచేస్తున్నారు. అయితే ఇటీవల ఆయన మిడ్ మానేరు నిర్వాసితురాలు వనభట్ల కవిత విషయంలో నిర్లక్ష్యంగా వ్యవహరించారు. ఆయనకు పరిహారం చెల్లించాలని కోర్టు ఆదేశాలు జారీ చేసినప్పటికీ ఆయన పట్టించుకోలేదు. పైగా ఆర్డీవో, ఎమ్మార్వోకు చెప్పి కేసులు నమోదు చేయించారు. దీంతో కవిత మరోసారి హైకోర్టును ఆశ్రయించారు. అయితే గతంలో ఇదే పిటిషన్ మీద హైకోర్టుకు సందీప్ కుమార్ హాజరయ్యారు. ఆ సమయంలో ఆయన వేసుకున్న డ్రెస్ పట్ల హైకోర్టు తీవ్ర




అభ్యంతరం వ్యక్తం చేసింది. కోర్టుకు వచ్చే ప్రొసీడింగ్ తెలియదా.. కోర్టుకు వచ్చే విధానం ఇదేనా అంటూ కలెక్టర్ మీద హైకోర్టు తీవ్రస్థాయిలో మండిపడింది.కవిత మరొకసారి హైకోర్టును ఆశ్రయించిన నేపథ్యంలో.. ఈసారి హైకోర్టు న్యాయమూర్తులు తీవ్రస్థాయిలో మండిపడ్డారు. గతంలో బాధితురాలికి పరిహారం ఇవ్వాలని ఇచ్చిన తీర్పును యధావిధిగా అమలు చేయాలని హైకోర్టు ఆదేశించింది. ఈ ఆదేశాలను సక్రమంగా అమలు చేయాలని ప్రభుత్వానికి.. ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కి హైకోర్టు సూచించింది. అంతేకాదు కలెక్టర్ ను చూస్తే భయం వేస్తోందని.. ఆయన డ్రెస్సింగ్ సెన్స్ బాగోలేదని.. ఇలాంటి వ్యక్తి ప్రజలకు ఎలా సేవ చేస్తారని హైకోర్టు తీవ్రస్థాయిలో మండిపడింది. వాస్తవానికి ఇటీవలి కాలంలో ఒక కలెక్టర్ మీద ఈ స్థాయిలో ఆగ్రహం వ్యక్తం చేయడం ఇదే తొలిసారి. కేటీఆర్, ఆయన అనుచరులు అక్రమాలు వెలుగులోకి తేవాలని సందీప్ కుమార్ ని పంపిస్తే.. రేవంత్ లక్ష్యం నెరవేరకపోగా.. పైగా హైకోర్టు నుంచి చివాట్లు ఎదురయ్యాయని కాంగ్రెస్ నేతలు అంటున్నారు.

# అరికెపూడి గాంధీ ఆక్రమణలపై చర్చ

**హైదరాబాద్ :** శేర్లింగంపల్లి నియోజకవర్గంలో గులాబీ పార్టీ గుర్తు మీద 2023 లో జరిగిన ఎన్నికల్లో అరికెపూడి గాంధీ ఎమ్మెల్యేగా గెలిచారు. అంతకుముందు ఎన్నికల కూడా ఆయన విజయం సాధించారు. 2014లో జరిగిన ఎన్నికల్లోను ఆయన ఎమ్మెల్యేగా గెలుపును సందం చేసుకున్నారు. మొత్తంగా హ్యాట్రిక్ ఎమ్మెల్యేగా రికార్డ్ సృష్టించారు. 2014లో జరిగిన ఎన్నికల్లో ఆయన తెలుగుదేశం పార్టీ గుర్తు మీద పోటీ చేసి గెలిచారు. అనంతరం మారిన రాజకీయ పరిణామాల నేపథ్యంలో 2016లో ఆయన గులాబీ పార్టీలో చేరారు. అప్పట్లో ఆయన చేరికను కెసిఆర్ రాజకీయ పునరేకి కరణ గా పేర్కొన్నారు.ఇక 2023 లో జరిగిన ఎన్నికల్లో ఎమ్మెల్యేగా గెలిచిన గాంధీ? ఆ తర్వాత కాంగ్రెస్ పార్టీకి దగ్గరయ్యారు. కాంగ్రెస్ పార్టీ కూడా ఈయనకు ప్రజాప్రతిల కమిటీ చైర్మన్ పదవి ఇచ్చింది. అతడికి ఆ పదవిని ఇవ్వడాన్ని భారత రాష్ట్ర సమితి తప్పు పట్టింది. ఆ తర్వాత గులాబీ పార్టీ ఎమ్మెల్యే కౌశిక్ రెడ్డి, గాంధీ మధ్య మాటల యుద్ధం సాగింది. ఒకానొక దశలో ఈ ఇద్దరు ఎమ్మెల్యేలు పరస్పరం దాడులకు పాల్పడతాం అన్నట్టుగా సంకేతాలు కూడా ఇచ్చారు. ఇరువురికి చెందిన అనుచరులు రచ్చ రచ్చ చేశారు. అప్పట్లో ఈ రెండు వర్గాల మధ్య జరిగిన సంఘటనలు హైదరాబాద్ లో సంచలనం సృష్టించాయి.కాంగ్రెస్ పార్టీకి గాంధీ దగ్గర కావడం వెనుక చాలా కారణాలు ఉన్నాయని అప్పట్లో భారత రాష్ట్ర సమితి ఆరోపించింది. ఇప్పుడిక సరికొత్త విషయాన్ని బయటపెట్టింది. గులాబీ పార్టీ నేత లక్ష్మారెడ్డి కీలక ఆధారాలను సేకరించి ఏకంగా రాష్ట్ర సర్వోన్నత న్యాయస్థానంలో ఫిర్యాదు చేశారు. మేడ్చల్ మల్కాజ్గిరి జిల్లా కుత్బుల్లాపూర్ మండలం గాజులరామారంలో సర్వేనెంబర్ 307 లోని 100 కోట్ల విలువైన ప్రభుత్వ భూమిని గాంధీకి అక్రమంగా బదిలీ చేశారని లక్ష్మారెడ్డి తన ఫిర్యాదులో



పేర్కొన్నారు. సర్వే నెంబర్ 307 లో సీలింగ్ కింద ప్రభుత్వ భూమి ఉంది. మిగిలిన ప్రైవేట్ భూమిలో ఇప్పటికే కొంతమంది పూర్తిగా ఇండ్లు నిర్మించుకున్నారు.అక్కడ ఎటువంటి ప్రవేట్ భూమి లేదని.. అయితే తమ పేరు మీద ఉన్న 11 ఎకరాలు ఎప్పుడో అమ్మేసి వెళ్లిపోయిన జాహేద్ బేగం, షేక్ ఇమామ్, ఇషాన్ ఆమీన్ అనే వ్యక్తులను తీసుకొచ్చి.. వారి భూమిని గాంధీ కొన్నట్టుగా చూస్తూ మోసానికి తెర లేపారని లక్ష్మారెడ్డి ఆరోపించారు. వాస్తవానికి ఆ ముగ్గురి వద్ద ఎటువంటి భూమి లేదని.. అక్రమంగా రిజిస్ట్రేషన్ లు చేయించి 11 ఎకరాల భూమిని స్వాహా చేయడానికి పథకం రూపొందించారని లక్ష్మారెడ్డి తన ఫిర్యాదులో పేర్కొన్నారు. ఆ 11 ఎకరాల భూమి ప్రభుత్వానికి సంబంధించిందని.. ఇందులో అక్రమంగా చేర్చిన వారి పేర్లను తొలగించాలని.. ఆర్డీఓ సర్టిపై చేసిన నాలా ప్రొసీడింగ్స్ రద్దు చేయాలని.. ఆ స్థలంలో బహుళ అంతస్తుల నిర్మాణానికి చేపడుతున్న ప్రణాళికలను అడ్డుకోవాలని ఆయన కోరారు.. లక్ష్మారెడ్డి హైకోర్టులో వేసిన పిటిషన్ లో ఎమ్మెల్యే గాంధీ, ఆయన భార్య శ్యామల దేవి, కుమార్తె నందిత, ఏడుగురు ప్రవేట్ వ్యక్తులు, రెవెన్యూ శాఖ ముఖ్య కార్యదర్శి, జిల్లా కలెక్టర్, ఆర్డీవో, కుత్బుల్లాపూర్ తహసీల్దార్ ను ప్రతివాదులుగా పేర్కొన్నారు.ఈ కేసును విచారించిన ధర్మాసనం భూ బదిలీపై కుత్బుల్లాపూర్ ఎమ్మార్వోకు ఫిర్యాదు చేయాలని.. ఒకవేళ ఆయన గనుక స్పందించకపోతే న్యాయస్థానాన్ని ఆశ్రయించాలని పేర్కొంది. ఎమ్మార్వోకు ఫిర్యాదు చేసే విషయమైతే.. తమ పిటిషన్ వెనక్కి తీసుకుంటామని.. లక్ష్మణ్ రెడ్డి తరఫున న్యాయవాది పేర్కొన్నారు. దానికి న్యాయవాది అనుమతులు జారీ చేస్తూ.. ఉత్తర్వులు ఇచ్చారు. దీంతో లక్ష్మారెడ్డి కోర్టును ఆశ్రయించే పనిలో ఉన్నారు. ఒకవేళ అదే జరిగితే ఈ భూ వ్యవహారం రాష్ట్రంలో సంచలనంగా మారే అవకాశం ఉందని తెలుస్తోంది.

## కేటీఆర్ అరెస్ట్ తప్పదు.. కవిత పంచాయతీ వేరే అంశం

-మొదటిపేజీ తరువాయి

అభ్యర్థుల్ని తెలంగాణలో పర్యటిస్తారు. బీసీ రిజర్వేషన్లపై బీజేపీ నాయకులకు చిత్తశుద్ధి ఉంటే ఒక్కరోజులో బీసీ బిల్లుకు కేంద్రం ఆమోదం తెలపొచ్చు. గత ప్రభుత్వంలో జరిగిన అవినీతిపైన సీబీఐ విచారణ జరిపితే బాగుంటుంది. కవితది ఆస్తుల పంచాయతీ. కాంగ్రెస్‌తో కవితకు ఏంటి సంబంధం. కవితకు ప్రజల్లో ఏం ఇమేజ్ ఉంది?. దోపిడీ చేసిన వారిని ప్రజలు ఎందుకు ఆదరిస్తారు. ఫోన్ ట్యాపింగ్ పెద్ద కేసు, అందరి వాయిస్‌లు రికార్డు చేశారు. నాది, రేవంత్ రెడ్డిది రెండున్నర ఏళ్ల నుంచి గత ప్రభుత్వం రికార్డు చేసింది. నేను వాడిన జియో సిమ్ కార్డు నెంబర్ జియో సంస్థకు గత ప్రభుత్వం ఇచ్చింది. జియో సంస్థకు రాసిన లేఖ కూడా దొరికింది. ఫోన్ ట్యాపింగ్ చేసి గత ఎన్నికల్లో బీఆర్ఎస్ గెలిచింది. ఫార్ములా ఈ రేసు కేసులో కేటీఆర్ అరెస్ట్ తప్పదు. క్లియర్ ఆధారాలు ఉన్నాయి’ అని చెప్పుకొచ్చారు.

## మెట్రో నష్టాలు.. తెలంగాణ ప్రభుత్వమే తేల్చుకోవాలి

-మొదటిపేజీ తరువాయి

మాట్లాడుతూ.. శ్రీశైలం ఎలివేటెడ్ కారిడార్ నిర్మాణానికి కేంద్రం ముందుకొచ్చిందని, దీనిపై త్వరలోనే నిర్ణయం తీసుకుంటామని కేంద్రమంత్రి గడ్కరీ చెప్పారని అన్నారు. “భూసేకరణ త్వరగా పూర్తిచేస్తే.. ప్రాజెక్టుల నిర్మాణం త్వరగా అవుతుంది. మెట్రో విస్తరణలో సీఎం వ్యవహారశైలి సమంజసంగా లేదు. రాష్ట్రానికి నిధులు, ప్రాజెక్టులు రావాలని కోరుకునే వ్యక్తుల్లో ముందుంటా. ఆర్ఆర్ఆర్, మెట్రో విషయంలో ప్రోయాక్టివ్‌గా వ్యవహరించాం. హైదరాబాద్ మెట్రో ఇప్పటికే నష్టాల్లో నడుస్తోంది. మెట్రో నష్టాలు రాష్ట్ర ప్రభుత్వ వ్యవహారం.. వారే తేల్చుకోవాలి. మెట్రోకు అన్ని రకాలుగా మా సహకారం ఉంటుంది. కాళేశ్వరంపై సీబీఐ ప్రతిపాదనలు అందాయి. ఆ అంశం పరిశీలనలో ఉంది. భారత రాష్ట్ర సమితి, కాంగ్రెస్ పార్టీలకు భాజపా భయం పట్టుకుంది. భారత రాష్ట్ర సమితితోనో, కాంగ్రెస్ తోనో కలిసే ప్రసక్తే లేదు. గతంలో ఆ రెండు పార్టీలు కలిసి ప్రభుత్వాలు నడిపాయి. తెలంగాణలో ఒంటరిగానే పోటీ చేస్తాం. బీసీ రిజర్వేషన్లకు అసెంబ్లీలో మద్దతిచ్చాం. బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు అమలు చేయాలి” అని కిషన్‌రెడ్డి అన్నారు.

## భారీ వర్షాలున్నాయి.. అప్రమత్తంగా ఉండండి

-మొదటిపేజీ తరువాయి

ఉన్నప్పటికీ విద్యా సంస్థలు కూడా వర్షాలపై అప్రమత్తంగా ఉండాలని కోరారు. హైదరాబాద్‌లో జీహెచ్ఎంసీ, హైడ్రాతోపాటు, ఎన్డీఆర్ఎఫ్, ఎస్డీఆర్ఎఫ్ బృందాలు అప్రమత్తంగా ఉండాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదేశించారు.

## బై ఎలక్షన్స్ లేనట్టే

-మొదటిపేజీ తరువాయి

కండువాలు అని వారు స్పీకరుకు వివరణ ఇచ్చినందువలన ప్రజలు నవ్వడం కూడా నిజమే కావచ్చు.. అంతమాత్రాన సాంకేతికంగా వారి మీద అనర్హత వేయడం సాధ్యం కాదు. ప్రజలు నవ్వడం అనేదే గనుక ప్రామాణికం అయితే, ఇదే ప్రజలు కేసీఆర్ పరిపాలన మొదలైన నాటి నుంచి నవ్వడం అలవాటు చేసుకుని బతుకుతున్నారు.కల్వకుంట్ల చంద్రశేఖర రావు అప్పట్లో అటు తెలుగుదేశంలోనూ ఇటు కాంగ్రెస్ పార్టీలోనూ ఎమ్మెల్యే లందరినీ ఖాళీ చేయించడమే తన జీవిత ధ్యేయం అన్నట్లుగా విచ్చలవిడిగా ఫిరాయింపులను ప్రోత్సహించారు. ఒక పార్టీ తరఫున గెలిచి తర్వాత గులాబీ దళంలో చేరిన వారు మంత్రి పదవులు కూడా పుచ్చుకుని అగ్ర నాయకులయ్యారు. తెలంగాణ ప్రజలకు ఇలాంటి అనైతిక రాజకీయాలను చూసి నవ్వే అలవాటు ఉంటే గనుక, వారు అప్పట్లోనే పగలబడినవి ఉండాలి. అప్పట్లో ఎంత మాత్రం నవ్వుకున్నారో మనకి తెలియదు. ఇప్పుడు జగదీశ్ రెడ్డి తదితర బిఆర్ఎస్ నాయకులు ఆశపడినంత మాత్రాన మళ్ళీ నవ్వుతారని గ్యారెంటీ కూడా లేదుసాంకేతికంగా గమనిస్తే బిఆర్ఎస్ తరఫున గెలిచి ఆ తర్వాత కాంగ్రెస్ పార్టీలో చేరి ఎంపీ ఎన్నికలలో కూడా పోటీ చేసిన దానం నాగేందర్ కు తప్ప మరెవ్వరికీ కూడా అనర్హత వేటుపడే భయం లేదు అని అనుకోవచ్చు. రాబోయే మూడేళ్ల పాటు కూడా ఎమ్మెల్యేలు ఫిరాయించారు అని నిందలు వేసుకుంటూ గడపడమే తప్ప భారత రాష్ట్ర సమితి చేయగలిగింది మరి ఏమీ లేదు అని కూడా విశ్లేషకులు వ్యాఖ్యానిస్తున్నారు.

**దానం తప్ప మిగిలిన వారు సేఫేనా**

నిర్ణీత గడువులోగా నిర్ణయం తీసుకోవాలని సుప్రీం కోర్టు చెప్పిన తర్వాత.. ఆ ఎమ్మెల్యేలకు స్పీకరు నోటీసులు ఇచ్చి విచారించి, వివరణలు తీసుకోవడం జరిగింది. తాము పార్టీ మారలేదని, సమస్యల పరిష్కారం కోసం ముఖ్యమంత్రిని కలిసినప్పుడు.. ఆయన జాతీయజెండా రంగులను పోలిన కండువాను మాత్రమే కప్పారని వారు వివరణ ఇచ్చారు. ఆ తర్వాత మళ్లీ భారాస వాళ్లు కూడా తమ వాదనలు, తమ వద్ద ఉన్న సాక్ష్యాలతో మళ్లీ కంప్లయింటు చేశారు. కానీ.. స్పీకరు తన విచక్షణాధికారాన్ని బట్టి నిర్ణయం తీసుకోవడానికి అవకాశం ఉంది. అయితే.. దానం నాగేందర్ కు మినహా మిగిలిన ఎమ్మెల్యేలకు పదవులకు పెద్ద ప్రమాదం ఉండకపోవచ్చునని పలువురు అంచనా వేస్తున్నారు.ఎమ్మెల్యేలు కాంగ్రెసు పార్టీ వారిగా మారిపోయి ఉండవచ్చు. కానీ.. క్రియాశీల సభ్యత్వం వంటి ఆధారం వచ్చిన తర్వాత తప్ప.. వారిని కార్నర్ చేయడం సాధ్యం కాదు. దానం నాగేందర్.. పార్టీ మారిన తర్వాత.. కాంగ్రెసు టిక్కెటుపై సికింద్రాబాద్ ఎంపీగా కూడా పోటీచేశారు గనుక.. ఆయన గురించి ప్రత్యేకంగా సాక్ష్యాలు ఆధారాలు ఇక అనవసరం. కానీ.. మిగిలిన వారు చెప్పిన బుకాయింపు వాదనలకు మన్నన దక్కితే వారికి ఇబ్బంది లేదు.రేవంత్ కప్పిన మూడురంగుల కండువా ఫోటోలను, రాహుల్ ను కలిసిన ఫోటోలను భారాస నేతలు సాక్ష్యాలుగా సమర్పిస్తున్నారు. కానీ వాటివల్ల వేటు వేయడం సాధ్యం కాదు. వేరే పార్టీ నాయకుడిని ఒక పార్టీ ఎమ్మెల్యే కలవడమే అనర్హతకు కారణం కావాలని వారు కూడా వాదించలేరు. ప్రజలకు ఏం చెబుతారు.. నియోజకవర్గ ప్రజలకు ఏం చెబుతారు? అని మాజీ మంత్రి జగదీష్ రెడ్డి లాంటి వాళ్లు అడుగుతున్నారు. ఏం చెప్పాలో.. వారు నిర్ణయించుకోగలరు. ఆ పర్యవసానాలను వారు ఫేస్ చేసుకోగలరు. వారి గురించి గులాబీలకు ఆందోళన అనవసరంఇలా కాంగ్రెసు పార్టీలో ఉంటూ.. తాము పార్టీ మారలేదని స్పీకరుకు ఇచ్చిన వివరణలను చూసి ప్రజలు నవ్వుతారు కదా.. అని జగదీష్ రెడ్డి ఎద్దేవా చేస్తున్నారు. ప్రజలకు ‘నవ్వేంత’ చైతన్యం ఉంటే.. వారి ఫిరాయింపుల మీద భారాస పార్టీ కోర్టులో అనర్హత పిటిషన్లు వేసినప్పటినుంచి నవ్వుతూనే ఉండాలి.ఎందుకంటే.. కేసీఆర్ అధికారంలోకి వచ్చాక.. కాంగ్రెస్, తెలుగుదేశం పార్టీల నుంచి విచ్చలవిడిగా ఫిరాయింపులను ప్రోత్సహించి.. ఆ ఎమ్మెల్యేలకు మంత్రి పదవులను కూడా కట్టబెట్టిన పార్టీ వారిది. అలాంటి వారు.. తమ పార్టీనుంచి కొందరు వెళ్లగానే ప్రజాస్వామ్యం గురించి ఆందోళన చెందడం చూసి ప్రజలు నవ్వుకోవాలి కదా.. అని ప్రజలు భావిస్తున్నారు.

## ఎల్ అండ్ టీ ఔటేనా...

**హైదరాబాద్ :** హైదరాబాద్ మెట్రో రైలుపై తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సంచలన నిర్ణయం తీసుకునే అవకాశాలు కనిపిస్తున్నాయి. తరచూ బెదిరింపులకు దిగుతున్న ఎల్ అండ్ టి సంస్థను మెట్రో రైలు కార్పొరేషన్ నుంచి తప్పించాలని భావిస్తున్నారు. ఇప్పటికే మెట్రో రైలు ఎండీగా ప్రారంభం నుంచి పనిచేస్తున్న ఎన్వీఎస్ రెడ్డిని తప్పించి ఆయన స్థానంలో మరొకరిని నియమించడంతో ఈ ప్రచారం మరింత ఊపందుకుంది. ఎల్ అండ్ టి సంస్థ చేతులో మెట్రో రైలు ఉంటే తాము అనుకున్నట్లుగా నగరంలో విస్తరణ జరగదని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి భావిస్తున్నట్లు సమాచారం. అందుకే త్వరలోనే ఎల్ అండ్ టి సంస్థ కు హైదరాబాద్ మెట్రో రైలు బాధ్యతలను తప్పించాలని ఆయన నిర్ణయించినట్లు అధికార వర్గాల్లో జోరుగా ప్రచారం జరుగుతుంది.2017లో ప్రారంభమైన... హైదరాబాద్ లో మెట్రో రైల్ 2017లో ప్రారంభమైంది. 29.14 కి.మీ. ఫేజ్-1 నెట్‌వర్క్‌ను ఎల్ అండ్ టీ సంస్థ నిర్వహిస్తోంది. అంటే దాదాపు ఎనిమిదేళ్ల నుంచి ఆ సంస్థ మెట్రో రైలు నిర్వహణ బాధ్యతలను చూస్తోంది. అయితే తరచూ తమకు నిర్వహణలో నష్టాలు సంభవిస్తున్నాయని తెలిపింది. ఛార్జీలు పెంచుకునేందుకు కూడా ఇటీవల తెలంగాణ ప్రభుత్వం అనుమతించింది. అలాగే పార్కింగ్ స్థలాల వద్ద కూడా రుసుము పెంచింది. అయినా సరే ఎల్ అండ్ టి సంస్థ తరచూ నష్టాలు వస్తున్నాయని చెబుతూ తమను

# సెబీకి విశ్వసనీయత ఉందా!




షార్ట్– సెల్లింగ్‌లో 24 జనవరి 2023న ప్రత్యేకత కలిగిన హిండెన్‌బర్గ్ రీసెర్చ్ కంపెనీ షేరు ధర పడిపోతుందనే అంచనాతో దాని ధరపై పందెం వేయడం – అదానీ గ్రూప్ అకౌంటింగ్ అక్రమాలు, స్టాక్ మానిప్యులేషన్, షేర్ ధరలను పెంచడానికి ఆఫ్ షోర్ షెల్ కంపెనీలను ఉపయోగించిందని ఆరోపిస్తూ 106 పేజీల నివేదికను ప్రచురించింది. గత వారం ఈ ఆరోపణలలో కొన్నింటిని సెబీ తోసిపుచ్చింది. దాని నిబంధనల ప్రకారం అదానీ కంపెనీలు, సంబంధిత పార్టీల మధ్య ఎటువంటి లావాదేవీలు జరగలేదు. అందువల్ల, పెట్టుబడిదారులకు బహిర్గతం చేయవలసిన అవసరం లేదు. అవి మార్కెట్ మానిప్యులేషన్‌కు కారణమని పేర్కొంది. డబ్బులు దారి మళ్లించినట్లు లేదా నిధులను మళ్లించినట్లు లేదా పెట్టుబడిదారులు డబ్బును కోల్పోయినట్లు ఎటువంటి ఆరోపణలు లేవని కూడా సెబీ పేర్కొంది. అదానీ కంపెనీలు ఏదైనా సంస్థ నుండి తీసుకున్న రుణాలను దర్యాప్తు ప్రారంభానికి ముందే తిరిగి చెల్లించారని కూడా సెబీ పేర్కొంది. యోగ్యత ఆధారంగా, నిందించబడిన లావాదేవీలను తారుమారు లేదా మోసపూరిత లావాదేవీలు లేదా అన్యాయమైన వాణిజ్య పద్ధతులుగా వర్గీకరించలేమని కూడా నిర్ధారించబడింది. రాయిటర్స్ వార్తా సంస్థ ప్రకారం, సెబీ అదానీ సంస్థలపై రెండు అభియోగాలను తొలగించింది, కానీ ఇన్‌సైడర్ ట్రేడింగ్ నుండి పబ్లిక్ ఫ్లోట్ ఉల్లంఘనల వరకు 22 కేసులు పెండింగ్‌లో ఉన్నాయి. గత సంవత్సరం, షార్ట్–సెల్లర్ సెబీ మాజీ చీఫ్ మాధబి పూరి బుచ్ అదానీ గ్రూప్ ఉపయోగించే ఆఫ్‌షోర్ నిధులతో సంబంధాలు కలిగి ఉన్నారని ప్రతిపక్షాలు ఆరోపిస్తున్నాయి. మే నెలలో భారతదేశ అవినీతి నిరోధక వాచ్‌డాగ్ హిండేబర్గ్ ఆరోపణల ఆధారంగా ఆమెపై మోపబడిన అన్ని అవినీతి ఆరోపణల నుంచి ఆమెను తొలగించింది. ఈ సంవత్సరం ప్రారంభంలో, హిండేబర్గ్ రీసెర్చ్ వ్యవస్థాపకురాలు నేట్ ఆండర్సన్, కంపెనీని ప్రారంభించిన ఎనిమిది సంవత్సరాల తర్వాత దానిని రద్దు చేస్తున్నట్లు ప్రకటించారు. హిండెన్‌బర్గ్ విడుదల చేసిన నివేదికతో ప్రపంచం యావత్తూ గగ్గోలు పెట్టగా సెబీ ఆ కీలక ఆరోపణల్ని తోసిపుచ్చడం దారుణం. భారతదేశంలోని అతి ముఖ్యమైన రెగ్యులేటరీ సంస్థ సైతం అదానీ తదితర కార్పొరేట్లకు అనుకూలంగా మారిందనడానికిది తాజా తార్కాణం. అదానీపై హిండెన్‌బర్గ్ ఆరోపణలు నిరూపణ కాలేదు. అదానీ గ్రూప్ కంపెనీలు ఎలాంటి ఉల్లంఘనలకు పాల్పడలేదు. ఆ సంస్థపై జరిమానా విధించాల్సిన అవసరం లేదు అని సెబీ హోల్ టైం మెంబర్ కమలేష్ చంద్ర వర్షనేరు తన ఆర్డర్‌లో పేర్కొనడం దిగజారుడు తనానికి నిదర్శనం.

దీంతో అదానీ పవర్, గౌతం అదానీ, రాజేష్ అదానీలపై కొనసాగుతున్న దర్యాప్తు కార్యకలాపాలకు సెబీ మంగళం పాడింది. అదానీ గ్రూప్ తన కంపెనీల ఆదాయాన్ని పెంచడానికి, షేర్ల ధరలను కృత్రిమంగా మార్చడానికి విదేశీ బినామీ, షెల్ కంపెనీలను వాడుకుందని, అదానీ తీవ్ర ఆర్థిక మోసాలకు పాల్పడ్డారని అప్పట్లో వెల్లడించింది. ఆ దెబ్బతో ఆ సమయంలో స్టాక్ మార్కెట్‌లో అదానీ గ్రూపు కంపెనీల విలువ దాదాపు లక్షల కోట్లు హరించుకుపోయింది. అదానీ ఆర్థిక అక్రమాలను నిశితంగా పరిశీలించామని, సాక్ష్యాలను సంపాదించామని, దాదాపు 100 పేజీల సాక్ష్యాలను రిపోర్ట్‌లో హిండెన్‌బర్గ్ పేర్కొంది. అయినా అవేవీ సెబీ విచారణలో అక్కరకు రాలేదు లేదా వాటిని చూడ నిరాకరించినట్టుంది. ఏలినవారి మద్దతుగల శతకోటీశ్వరుడు తప్పు చేశారనీ, ఆర్థిక అక్రమాలకు పాల్పడ్డారనీ సెబీ చెప్పగలదా? ముమ్మాటికీ అలాంటిది అసంభవమని గత పదేళ్ల చరిత్ర చెబుతోంది. అప్పటి సెబీ చైర్‌పర్సన్ మాధాబి పురీ బుచ్‌కు అదానీ గ్రూపు సంస్థలతో ఉన్న అక్రమ ఆర్థిక సంబంధాన్ని సైతం హిండెన్‌బర్గ్ బయటపెట్టిన విషయం తెలిసిందే. హిండెన్‌బర్గ్ ఆరోపణలు నిరాధారం అంటూనే బెర్ముడా, మారిషస్ వంటి అఫ్ షోర్ కంపెనీల్లో, అందునా గౌతం అదానీ సోదరుడు వినోద్ అదానీ ఆధ్వర్యంలోని ఇన్వెస్ట్‌మెంట్ ఫండ్ సంస్థల్లో పెట్టుబడులు పెట్టినట్లు బుచ్ ఫ్యామిలీ అంగీకరించిన విషయం లోకానికెరుకే! తన భర్త బాల్య స్నేహితుడు నిర్వహిస్తున్న ఫండ్‌లోనూ పెట్టుబడులు పెట్టారని మాధాబి అప్పట్లో ధ్రువీకరించారు. 'అదానీ గ్రూపు సంస్థల్లో పెట్టుబడుల తీరును సమీక్షించాల్సిన సెబీ చైర్మన్‌కు వాటిల్లో వ్యక్తిగత పెట్టుబడులు, ఇతర స్పాన్సర్ల నిధులు ఉన్నాయి. ఇది విరుద్ధ ప్రయోజనాల అంశం కిందకు వస్తుంది' అని హిండెన్‌బర్గ్ ఆరోపించింది. అదానీ కంపెనీలతో సెబీ మాజీ చైర్‌పర్సన్ మాధాబి చరిత్ర ఇదే. దేశంలో కార్పొరేట్ కంపెనీల ఆర్థిక వ్యవహారాలను నియంత్రించవలసిన సంస్థకు అధినేతలుగా అటువంటి వ్యక్తులను నియమించడంలోనే అసలు తిరకాసు ఉంది. నయా ఉదారవాద ఆర్థిక విధానాల అమలు క్రమంలో దేశంలో కార్పొరేట్లు, బ్యూరోక్రాట్లు, రాజకీయ నాయకుల మధ్య బలమైన బంధం ఏర్పడింది. ఆ బంధం గత పదకొండేళ్ల నరేంద్ర మోడీ పాలనలో మరింతగా బలపడింది. అందుకే ఈ మూడు తరగతులకు చెందినవారు ఒకరినొకరు సమర్థించుకోవడం రివాజుగా మారింది. తాజా అంశం వాటిలో ఒకటి మాత్రమే! అదానీ సెకీ కుంభకోణం గురించి ఒకసారి గుర్తు తెచ్చుకున్నా ఈ విషయం అర్థం అవుతుంది. అదానీ గ్రూపు కార్పొరేట్లు, సెకీ, రాష్ట్ర విద్యుత్ రంగ ఉన్నతాధికారులు అప్పటి ప్రభుత్వాధినేతతో జరిపిన మంతనాలు, వేల కోట్ల రూపాయలు చేతులు మారడం, ఇవన్నీ ఒక్కసారి సినిమా రీల్ మాదిరి తిరుగుతాయి.

# సంఘ సంస్కర్త బంకుపల్లె మల్లయ్యశాస్త్రి

బంకుపల్లె మల్లయ్యశాస్త్రి ప్రముఖ పండితుడు. . రచయిత. ప్రధానంగా సంఘసంస్కర్త. సాంప్రదాయ కుటుంబంలో జన్మించిన మల్లయ్యశాస్త్రి హైందవ సాంప్రదాయంలో ఉన్న మూఢాచారాలను పూర్తిగా వ్యతిరేకించాడు. స్త్రీ పునర్వివాహము శాస్త్రీయమని అనేక సభలలో వాదించి నిరూపించాడు. స్త్రీ విద్య ఆవశ్యకత గురించి పలు ఉపన్యాసాలు చేశాడు. తన ద్వితీయభార్యకు విద్య నేర్పించి మూడు ప్రబంధాలు, భారత భాగవత పురాణాలను నేర్పించాడు. ఆయన నేర్పిన విద్య, అందించిన ప్రోత్సాహం కారణంగా ఆమె సంగ్రహ రామాయణము, మరికొన్ని గ్రంథాలను రచించ గలిగింది. రజస్వలానంతర పురుష సంయోగార్హ కాలమే స్త్రీలకు వివాహకాలం అన్న సిద్ధాంతాన్ని ప్రకటించాడు. స్త్రీ పునర్వివాహము పూర్వాచారము కాకపోయినప్పటికి శాస్త్రీయము కాబట్టి ఆచరణీయమని వాదించాడు. సతీ శాసనము వచ్చిన తర్వాత పునర్వివాహము అవశ్యకత కలిగినదని వాదించి పత్రికలలో చర్చ కొనసాగించాడు. శారదా చట్టం ప్రతిపాదించిన కాలంలో ఆ చట్టానికి అనుకూలంగా మద్రాసు మొదలైన పలు ప్రాంతాలలో పలు సభలలో చర్చలు చేసి పండితులతో రజస్వలానంతర వివాహమే శాస్త్రీయమని అంగీకరింప చేశాడు. మల్లయ్య శాస్త్రి కుమార్తె కృష్ణవేణమ్మను శతావధాని వేదుల సత్యనారాయణశాస్త్రికి ఇచ్చి పునర్వివాహం చేశాడు. తన రెండవ భార్యవలన కలిగిన ప్రథమ కుమారుని జనన సమయంలో వారి ఆచారం ప్రకారం నల్లమేకను శక్తికి బలి ఇవ్వవలసి ఉండగా, ఆ ఆచారాన్ని విసర్జించాడు. శాఖాంతర వివాహం చేసి ఆకాలంలో ఆదర్శంగా నిలిచాడు. అస్పృశ్యత వ్యతిరేకంగా ఆంధ్రపత్రిక, త్రిలింగ పత్రికలలో వ్యాసాలు రాశాడు. మద్రాసు, నెల్లూరు, గుంటూరు, గోదావరి, కృష్ణ, విశాఖపట్నం, గంజాం మండలాలలో తిరిగి అస్పృస్యతా ప్రచారం చేశాడు. శూద్రులను తన ఇంటికి పిలిచి వారితో పాటు భోజనము చేసేవాడు. అప్పారావు అనే ఒక బ్రాహ్మణేతరుడిని తన ఇంటిలోనే ఉంచుకుని తన కుమారులతో పాటుగా చదువు సంధ్యలు చెప్పాడు. ఆయన ఆంధ్రపత్రిక, భారతి పత్రికలద్వారా ధర్మశాస్త్రములను పరిశీలించి అందలి విషయాలను సప్రమాణకంగా ప్రకటించేవాడు. మల్లయ్యశాస్త్రి 1876వ సంవత్సరం ఏప్రిల్ 29వ తేదీ ధాత నామ సంవత్సరం వైశాఖ శుద్ధ పంచమి నాడు పునర్వసు నక్షత్రము, తులాలగ్నములో గంజాం జిల్లా సింగుపురం గ్రామంలో తన మాతామహుని ఇంటిలో జన్మించాడు. స్వగ్రామం శ్రీకాకుళం జిల్లా, నరసన్నపేట మండలానికి చెందిన ఉర్లాం గ్రామం. ఆయన తల్లిదండ్రులు సూరమ్మ, గంగన్న. ఆయనది కృష్ణ యజుశ్శాఖ, ఆపస్తంబ సూత్రుడు, భారద్వాజ గోత్రుడు. మల్లయ్యశాస్త్రి తన ఐదవ యేట తన తండ్రివద్ద వేదాధ్యయనము ప్రారంభించాడు. తరువాత ఉర్లాం జమీందారు కందుకూరి బసవరాజు ఆస్థాన పండితుడైన భళ్లమూడి లక్ష్మణ శాస్త్రి వద్ద సంస్కృతము నేర్చుకున్నాడు. తన పదహారవ యేడు వచ్చే సమయానికి పంచ.కావ్యాలు పూర్తిగా చదివాడు. తరువాత పర్లాకిమిడి రాజా వారి సంస్కృత కళాశాలలో చేరి అక్కడ భళ్లమూడి వెంకటశాస్త్రి వద్ద శృంగార నైషధము, అభిజ్ఞాన శాకుంతలము చదివాడు. తరువాత పరవస్తు రంగాచార్యుల వద్ద సిద్ధాంత కౌముది పూర్తి చేశాడు. కూరెళ్ల సూర్యనారాయణశాస్త్రి వద్ద తర్కశాస్త్రము చదువు కున్నాడు. పోకల సింహాచలం వద్ద సంగీతము నేర్చుకున్నాడు. బంకుపల్లి కామశాస్త్రి వద్ద మంత్ర శాస్త్రాన్ని అభ్యసించాడు. భళ్లమూడి దక్షిణామూర్తి శాస్త్రి వద్ద పంచదశ ప్రకరణములు, గీతాభాష్యము చదువు కున్నాడు. శ్రీకూర్మం సంస్కృత పాఠశాల పండితుడైన నౌడూరి వెంకటశాస్త్రి వద్ద మనోరమ, శబ్దరత్నములు, పారిభాషేందు శేఖరము చదివాడు. గిడుగు రామమూర్తి పంతులు వద్ద ఇంగ్లీషు చదివాడు. మంత్రశాస్త్ర విద్యలో తన సహాధ్యాయి అయిన గంటి సూర్యనారాయణ శాస్త్రి వద్ద వేదాంత, మీమాంస శాస్త్రాలను నేర్చుకున్నాడు. నీలమణి పాణిగ్రాహి వద్ద సూర్యసిద్ధాంత దర్పణాలను చదివి దృక్సిద్ధ పంచాంగాలను ఐదారు సంవత్సరాలు వెలువరించాడు. మల్లయ్యశాస్త్రి తన 21వ యేట శ్రీకాకుళం హైస్కూలులో తెలుగు పండిత పదవికి 18మంది పండితులతో పోటీపడి ప్రథముడిగా నెగ్గి ఆ ఉద్యోగాన్ని సంపాదించు కున్నాడు. అక్కడ రెండు సంవత్సరాలు పనిచేశాడు. తర్వాత కొంతకాలం లుకలాం గ్రామంలో కన్నేపల్లి రామావధాని కుమారులకు సంస్కృతం బోధించాడు. ఆ తర్వాత పర్లాకిమిడి రాజా వారి ఇంగ్లీషు కళాశాలలో తెలుగు పండిత పదవిని చేపట్టాడు. బరంపురం సిటీ కాలేజీలో కూడా సంస్కృతాంధ్ర పండితుడిగా కొంతకాలం పనిచేశాడు.1912లో కలకత్తా సంస్కృత విద్యా పీఠంలో పరీక్ష ఉత్తీర్ణుడై కావ్యతీర్థ బిరుదాన్ని పొందాడు. సంస్కృతంలో సీతా కళ్యాణము, జానకీ వహ్ని ప్రవేశము అనే పురాణ హరికథలుగా వ్రాసినందుకు సంస్థానం రాజు "పురాణ వాచస్పతి" అనే బిరుదును ప్రదానం చేశాడు. ఆంధ్ర విద్యారణ్య, విద్యారత్న బిరుదులు పొందాడు. ఆయన కాశీయాత్రను ముగించుకుని తిరుగు ప్రయాణంలో ఖరగ్‌పూర్ వద్ద 1947, సెప్టెంబరు 26న తనువు చాలించాడు.

# గర్భ నిరోధక పద్ధతులు- ఆరోగ్యం

మహిళా ఆరోగ్యం, శ్రేయస్సు కాపాడడంలో గర్భ నిరోధక పద్ధతులు బహుళ ప్రచారం పొందాయి. ప్రపంచవ్యాప్తంగా జనాభా నియంత్రణకు గర్భ నిరోధక పద్ధతులు వరంగా మారాయి. ఎంత మంది పిల్లలను కనాలి, ఎప్పుడు కనాలి లాంటి నిర్ణయాలు తీసుకొని గర్భనిరోధక పద్ధతులను అవలంబిస్తూ కుటుంబాలు ఎదగడం చూస్తున్నాం. "ఇద్దరు పిల్లలే ముద్దు" అనే నినాదం నుంచి నేడు "ఒక్కరు లేదా అసలే వద్దు (వన్ ఆర్ నన్)" నినాదాన్ని వెంటేసుకొని గర్భ నిరోధక మార్గాలను పాటిస్తూ ఒక్కరే సంతానాన్ని కనడం వరకు పరిస్థితి వచ్చింది. నేడు అందుబాటులో ఉన్న గర్భ నిరోధక పద్ధతులు, యువతలో లైంగిక – పునరుత్పత్తి ఆరోగ్యాలపై సమాచారంతో కూడిన ఎంపిక పట్ల సాధారణ ప్రజలకు అవగాహన కల్పించటానికి ప్రతి ఏట 26 సెప్టెంబర్ రోజు "ప్రపంచ గర్భ నిరోధక దినోత్సవం (వరల్డ్ కాంట్రసెప్టివ్ డే)" పాటించడం 2007 నుంచి ఆనవాయితీగా మారింది. ప్రపంచ గర్భ నిరోధక దినం–2025 ఇతివృత్తంగా "అవాంతరాలను ఛేదించడం, వారసులను నిర్మించడం – అందరి ముంగిట గర్భ నిరోధక పద్ధతులు" అనబడే అంశాన్ని తీసుకొని అవగాహన కల్పించడం జరుగుతోంది. ప్రజారోగ్య సిబ్బంది, ఎన్‌జీఓ సంస్థలు, ప్రభుత్వ యంత్రాంగం సమన్వయంతో గర్భ నిరోధక పద్ధతుల పట్ల సంపూర్ణ అవగాహన కల్పించాలి. గర్భ నిరోధక పద్ధతులతో మహిళా సాధికారత, పరిపూర్ణ ఆరోగ్య సురక్ష, కెరీర్ అభివృద్ధి, కుటుంబ ఆరోగ్యం, మహిళా హక్కుల పరిరక్షణ, లింగ సమానత్వ సాధన లాంటి ప్రయోజనాలు కూడా కలుగుతున్నాయి. నేడు పలు రకాల గర్భ నిరోధక పద్ధతులు అందుబాటులో ఉన్నాయి. ఇంప్లాంట్లు, గర్భాశయ పరికరాలు (ఐయూడిలు), స్టెరిలైజేషన్ వంటి గర్భ నిరోధక పద్ధతులు పాటించడం కొనసాగుతున్నది. గర్భ నిరోధక మాత్రలు, ఇంజెక్షన్లు, ప్యాచ్‌లు, వాసెక్టమీ, కండోమ్‌లు, యోని రింగులు వంటి పద్ధతులను కూడా పాటిస్తున్నారు. ప్రణాళిక చేయని గర్భాలను తగ్గించడం, తమ కెరీర్‌ను బట్టి నిర్ణయాలు తీసుకోవడం, లింగ సమానత్వ సాధన, మహిళ లైంగిక ఆరోగ్యాన్ని బట్టి గర్భం దాల్చడం, గర్భ నిరోధక పద్ధతులను ప్రచారం చేయడం లాంటి లక్ష్యాలను ఈ వేదికగా వివరిస్తారు. అన్ని వయస్సుల వారికి, అన్ని వర్గాల ప్రజలకు, ఆడ మగ వర్గాలకు, కుటుంబ నేపథ్యాలకు తావులేకుండా అందరికీ గర్భ నిరోధక పద్ధతులు, లైంగిక ఆరోగ్యాల పట్ల అవగాహన కల్పించడం జరుగుతున్నది. యుక్త వయస్సు వచ్చిన తర్వాత గర్భం దాల్చడం, ఇద్దరు పిల్లల మధ్య 3 లేదా అంత కన్న ఎక్కువ సంవత్సరాలు ఉండే విధంగా చూసుకోవడం, ఎందరు పిల్లల్ని కనాలి అనే విషయంలో నిర్ణయం తీసుకొని తగు రీతిలో గర్భ నిరోధక పద్ధతులను పాటించడం విధిగా జరగాలి. గర్భ నిరోధక పద్ధతుల అమలు వ్యక్తులు, కుటుంబాలు, పౌర సమాజం పట్ల పలు రకాలుగా ప్రభావాన్ని చూపుతున్నాయి. కుటుంబ నియంత్రణ అమలులో గర్భ నిరోధక పద్ధతులను ప్రభుత్వాలు పలు విధాలుగా ప్రచారం చేయడం, సఫలం కావడం, ప్రపంచ స్థాయిలో జనాభా నియంత్రణ జరగడం చూసాం, నేటికీ చూస్తూనే ఉన్నాం. గర్భ నిరోధక పద్ధతులతో మాతాశిశు ఆరోగ్యం, ప్రణాళిక చేయని గర్భం దాల్చడాన్ని నిరోధించడం, మహిళ ఆరోగ్యానికి పట్టం కట్టడం లాంటి ప్రయోజనాలు ఒనగూడు తున్నాయి. గర్భ నిరోధక పద్ధతుల ద్వారా మహిళా లోకం ఆరోగ్యాన్ని పొందుతూ శక్తివంతం కావడం జరుగుతున్నది.

## వెంకటాపురంలో దుర్గామాత పూజలో పాల్గొన్న అశోక్ యాదవ్

శుభోదయం న్యూస్:



వెంకటాపురం గ్రామంలో దుర్గామాత నవరాత్రుల పూజా కార్యక్రమంలో పాల్గొనీ గ్రామస్తులందరూ సుఖ సంతోషాలతో అష్టైశ్వర్యాలతో పాడిపంటలు బాగా పండాలని సంతోషంగా ఉండాలని కోరుకోవడం జరిగింది యాదవ సంఘం కుల పెద్ద మనిషి గ్రామ బొట్టు దారుడు,న్యాల అశోక్ యాదవ్, మహేష్, నాగరాజు, దిలీప్, సాయి, వినీత్, హరీష్ గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

## ఫార్మసిస్టులకు శుభాకాంక్షలు తెలిపిన మంత్రి దామోదర రాజనర్సింహ

సంగారెడ్డి జిల్లా ప్రతినిధి అనిల్ (శుభోదయం న్యూస్ )



అందోల్ : వరల్డ్ ఫార్మసిస్ట్ డే సందర్భంగా ఫార్మసిస్టులకు మంత్రి దామోదర రాజనర్సింహ గురువారం శుభాకాంక్షలు తెలిపారు. ఆయన మాట్లాడుతూ... ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించడంలో ఫార్మసిస్టులు సేవలు కీలకమని మంత్రి పేర్కొన్నారు. అనంతరం క్యాంప్ ఆఫీసులో తనకు కలవడానికి వచ్చిన ఫార్మాసిస్టులతో కలిసి మంత్రి కేక్ కట్ చేశారు.

## మరో 2 రోజుల వానలు

**హైదరాబాద్ :** హైదరాబాద్ వాతావరణ కేంద్రం తెలంగాణలోని పలు జిల్లాలకు భారీ వర్ష సూచన చేసింది.ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అధికారులు సూచించారు. బంగాళాఖాతంలో ఏర్పడిన ఆవర్తనం గురువారం అల్పపీడనంగా, శుక్రవారం వాయుగుండంగా బలపడనుందని వాతావరణ శాఖ అధికారులు తెలిపారు. ఇది శనివారం నాటికి తీరం దాటే అవకాశం ఉందని, దీని ప్రభావంతో రాష్ట్రవ్యాప్తంగా తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు, కొన్ని చోట్ల భారీ వర్షాలు నమోదవుతాయని అంచనా వేశారు. గురువారం మంచిర్యాల, నిర్మల్, నిజామాబాద్, జయశంకర్ భూపాలపల్లి, ములుగు, మహబూబాబాద్, వరంగల్, హన్మకొండ, జనగాం, నల్లగొండ, సూర్యాపేటలో భారీ వర్షాలు కురుస్తాయని వెల్లడించింది. ఈ జిల్లాలకు ఎల్లో హెచ్చరికలను జారీ చేసింది. మిగిలిన జిల్లాల్లో ఉరుములు, మెరుపులతోకూడిన తేలికపాటి నుంచి ఒక మోస్తారు వానలు కురుస్తాయని, 30 నుంచి 40 కిలోమీటర్ల వేగంతో ఈదురుగాలులు వీస్తాయని వెల్లడించింది. శుక్రవారం ఆదిలాబాద్, కుమ్రం భీం ఆసిఫాబాద్, మంచిర్యాల, నిర్మల్, నిజామాబాద్, పెద్దపల్లి, జయశంకర్ భూపాలపల్లి, ములుగు, భద్రాద్రి కొత్తగూడెం, మహబూబాబాద్, వరంగల్, హనుమకొండ జిల్లాల్లో భారీ వర్షాలు కురుస్తాయని తెలిపింది. ఈ జిల్లాలకు ఎల్లో హెచ్చరికలు జారీ చేసింది. ఇక శనివారం భారీ నుంచి అతి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్నట్లు తెలిపింది. నిర్మల్, నిజామాబాద్, వికారాబాద్, సంగారెడ్డి, మెదక్, కామారెడ్డి, మహబూబ్‌నగర్ జిల్లాల్లో అతి భారీ వర్షాలు కురుస్తాయని వెల్లడించింది. ఈ జిల్లాలకు ఆరెంజ్ అలెర్ట్ జారీ చేసింది. ఆదిలాబాద్, కుమ్రం భీం, మంచిర్యాల, జగిత్యాల, సిరిసిల్ల, కరీంనగర్, పెద్దపల్లి, భూపాలపల్లి, ములుగు, భద్రాద్రి కొత్తగూడెం, జనగాం, సిద్దిపేట, యాదాద్రి భువనగిరి, రంగారెడ్డి, హైదరాబాద్, మేడ్చల్, నాగర్‌కర్నూల్, వనపర్తి, నారాయణపేట, గద్వాల జిల్లాల్లో అక్కడక్కడ భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని వెల్లడించింది. ఈ జిల్లాలకు ఎల్లో హెచ్చరికలు జారీ చేసింది

## ఉద్యోగాలకు వెయిటేజ్

**హైదరాబాద్ :** ఆర్టీసీలో ఇటీవల ప్రభుత్వం విడుదల చేసిన నోటిఫికేషన్లు డ్రైవర్లు, శ్రామిక్, ఇతర క్యాటగిరిలా వారిగా ఉద్యోగులు ఉన్నాయి. ఇందులో ప్రైవేట్ హైర్ బస్ డ్రైవర్లకు, ఔట్సోర్సింగ్ డ్రైవర్లకు 30% వెయిటేజ్ ఇవ్వాలని ఏఐటీయూసీ కుమ్రం భీం ఆసిఫాబాద్ జిల్లా అధ్యక్షుడు టి.దివాకర్ డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా బుధవారం ఆసిఫాబాద్ ఆర్టీసీ డిపో మేనేజర్ రాజశేఖర్ కి ఏఐటీయూసీ ఆధ్వర్యంలో వినపత్రం అందజేశారు. వినతి పత్రం ఇచ్చిన తర్వాత ఏఐటీయూసి అధ్యక్షుడు టి.దివా కర్ మాట్లాడుతూ.. గత 20 సంవత్సరాల నుంచి చాలీచాలని వేతనాలు తీసుకుంటూ ఆర్టీసీ సంస్థకు లాభాలు రావడంలోనూ ఆర్టీసీ సంస్థ అభివృద్ధి చెందడంలోనూ ప్రైవేట్ హైర్ బస్ డ్రైవర్లు, అవుట్ సోర్సింగ్ సిబ్బంది అత్యంత కీలక పాత్ర పోషిస్తున్నారని అన్నారు. ఇతర డిపార్ట్మెంట్లో నియామకాలు చేపట్టేటప్పుడు వేయిటేజ్ మార్కులు ఇస్తా రని, అలాగే ఆర్టీసీలో కూడా 30% మార్కుల నుంచి మొదటి ప్రాధాన్యత వీరికే ఇవ్వాల న్నారు. చాలిచాలని జీతాలతో పనిచేస్తున్న హైర్ బస్ డ్రైవర్లకు మొదటి ప్రాధాన్యత కల్పించే దిశగా ప్రభుత్వం కృషి చేయాలని, లేని పక్షంలో ఏఐటీయూసీ ఆధ్వర్యంలో ఆందోళన కార్యక్రమాలు చేస్తామని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఆసిఫాబాద్ జిల్లా కార్యదర్శి ఉపేందర్, ప్రైవేట్ హైర్ బస్ డ్రైవర్స్ యూనియన్ ఆసిఫాబాద్‌డిపో అధ్యక్షుడు మాధుసూధన్, ఉపాధ్యక్షుడు భాస్కర్, నాయకులు పాల్గొన్నారు.

## ప్రేమపేరుతో నమ్మించి అత్యాచారం

**నల్గొండ :** హైదరాబాద్‌లోని తార్నాకలో దారుణం జరిగింది. ప్రేమ పేరుతో ముగ్గురు మైనర్ బాలికలను యాదగిరిగుట్టకు తీసుకెళ్లి అత్యాచారం చేశారు ముగ్గురు యువ కులు. ఉస్మానియా యూనివర్సిటీ పరిధిలో తొమ్మిదో తరగతి చదువుతున్న ముగ్గురు బాలికలకు మాయమాటలు చెప్పి.. సదరు యువకులు బడి ఎగ్గొట్టేలా చేశారు. ఆ యువకుల మాటలు నమ్మిన బాలికలు స్కూల్‌లో బతుకమ్మ వేడుకలు ఉన్నాయని చెప్పి ఇంటి నుంచి బయటకు వెళ్లారు. శనివారం యాదగిరిగుట్టకు దైవ దర్శనానికి తీసుకెళ్లి.. అక్కడ ముగ్గురు బాలికలపై ఆ యువకులు అత్యాచారానికి ఒడిగట్టారు. అనంతరం బాలికలను హైదరాబాద్‌లో వదిలిపెట్టి పరారయ్యారు. సాయంత్రం తార్నాకకు తిరిగొచ్చాక జరిగిన సంఘటనపై తల్లిదండ్రులకు సమాచారమిచ్చారు బాలికలు. బాలికల పేరెంట్స్ ఫిర్యాదుతో నిందితులను అదుపులోకి తీసుకున్నారు అల్వాల్ పోలీసులు. వారిపై ఫోక్సో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. బాలికలను మోసం చేసిన యువకులలో ఉఊఓఅ కాంట్రాక్ట్ ఉద్యోగి మధు, షాపింగ్ మాల్‌లో పనిచేసే వంశీ, పెట్రోల్ బంకులో పనిచేసే నీరజ్ ఉన్నట్టు గుర్తించారు పోలీసులు. కాగా, ఈ ముగ్గురు నిందితులతో పాటు.. లాడ్జి ఓనర్‌ను అదుపులోకి తీసుకున్నారు

# ఉద్యమకారులకు ఇచ్చిన హామీలను నెరవేర్చాలి

వలిగొండ మండల రిపోర్టర్ (శుభోదయం న్యూస్):



తెలంగాణ ప్రభుత్వం ఉద్యమకారులకు ఇచ్చిన హామీలను నెరవేర్చకుండా కాలయాపన చేస్తున్నందున తెలంగాణ ఉద్యమకారుల ఫోరం రాష్ట్ర కమిటీ ఆదేశాను సారం అధ్యక్షులు డాక్టర్ చీమ శ్రీనివాసరావు ఆధ్వర్యంలో రాష్ట్రంలోని 584 మండలాలలో ఉద్యమకారుల చైతన్య యాత్రను సెప్టెంబర్ 13 న ఎల్బీనగర్ చౌరస్తాలోని శ్రీకాంతాచారి విగ్రహం వద్ద ప్రారంభించి రాష్ట్రంలోని 584 మండలాలలో ఉద్యమకారులను ఏకం చేయాలని అందులో భాగంగానే ఉమ్మడి రంగారెడ్డి జిల్లా మరియు వరంగల్ జిల్లాలోని అన్ని మండలాలను పూర్తిచేసుకుని ఉమ్మడి హైదరాబాదులో ఆదివారం ఉదయం 8:30 గంటలకు ఈసీఐఎల్ లోని అంబేత్కర్ విగ్రహం నుండి కీసరలోని మహాశివుని ఆలయంవరకు ఈ చైతన్య యాత్ర కొనసాగుతుందని,ఈ చైతన్య యాత్రలో ఉద్యమకారులు వివిధ పార్టీల నాయకులు వివిధ సంఘాల నాయకులు ఉద్యమకారులంతా పాల్గొని,విజయవంతం చేయాలనీ ప్రతి ఉద్యమకారుడు తమ తమ మండలాలలో ఉద్యమకారు లంతా ఐక్యతను చాటాలని ఈ ప్రభుత్వం ఇచ్చిన ఆరు గ్యారంటీలలో ఆరవ గ్యారెంటీగా ఉద్యమకారులకు ఇచ్చిన హామీలలో250 గజాల ఇంటి స్థలాలు 25 వేల పెన్షన్ సౌకర్యం కల్పించాలని మరియు మా డిమాండ్ల గుర్తింపు కార్డులు ఇచ్చి గుర్తించి ఆర్టీసీ బస్సులలో ట్రైన్లలో ఉచిత సౌకర్యం కల్పించి పదివేల కోట్లతో సంక్షేమ బోర్డు ఏర్పాటు చేసి ఉద్యమకారులకు న్యాయం చేయాలని లేనియెడల ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని ఉద్యమకారుల ఫోరం రాష్ట్ర ఉపాధ్యక్షులు జోగు అంజన్న ఒక పత్రికా ప్రకటనలో తెలియజేశారు.

# షూటింగ్ బాల్ పోటీలో జోగులాంబ గద్వాల జిల్లా టీం విజేతగా విద్యార్థులను అభినందించిన ఎమ్మెల్యే

గద్వాల్, జిల్లా ప్రతినిధి -రమేష్ (శుభోదయం న్యూస్) :




ఇటీవలే తెలంగాణ రాష్ట్రంలోని నిర్వహించిన రాష్ట్ర స్థాయి జూనియర్ షూటింగ్ బాల్ పోటీలలో జోగులాంబ గద్వాల జిల్లాకు చెందిన వివిధ ప్రభుత్వ పాఠశాల విద్యార్థిని విద్యార్థులు ఈనెల 22వ తేదీ నుండి 24వ తేదీ వరకు మహబూబాబాద్ జిల్లాలో నెల్లికుదురులో జరిగిన రాష్ట్రస్థాయి జూనియర్ షూటింగ్ బాల్ పోటీలో జోగులాంబ గద్వాల జిల్లా చెందిన టీం విజేతగా గెలుపొందడం జరిగినది ఈ సందర్భంగా ఈరోజు గద్వాల జిల్లా కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో నందు గద్వాల ఎమ్మెల్యే శ్రీ బండ్ల కృష్ణమోహన్ రెడ్డి మర్యాదపూర్వకంగా కలిసి ఎమ్మెల్యే చేతుల మీదుగా ట్రోఫీని అందుకోవడం జరిగింది.రాష్ట్రస్థాయి షూటింగ్ బాల్ పోటీలో పాల్గొని విజేతల సాధించిన విద్యార్థిని విద్యార్థులకు వారి కోచ్ ను ఎమ్మెల్యే అభినందనలు తెలిపారు.

**ఎమ్మెల్యే మాట్లాడుతూ...**

గ్రామీణ ప్రాంతంలోని విద్యార్థులు చదువుతోపాటు క్రీడారంగంలో కూడా నైపుణ్యత పొంది ఉండాలి క్రీడల వల్ల మనకు ఎన్నో ఉపయోగాలు ఉన్నాయి శారీరకంగా మానసికంగా దృఢత్వాన్ని పెంచుతుంది. ప్రతి ఒక్క విద్యార్థి చదువుతోపాటు క్రీడల్లో క్రికెట్ కబడ్డీ, షూటింగ్ బాల్ బాస్కెట్బాల్, ఫుట్బాల్ క్రీడలలో నైపుణ్యం పొంది ఉండాలి అని పేర్కొన్నారు. భవిష్యత్తులో అండర్ 19 జాతీయస్థాయి లో కూడా క్రీడలను ప్రదర్శించి గద్వాల కీర్తి ప్రతిష్టలను పెంచాలి అని పేర్కొన్నారు.అదేవిధంగా ప్రతి ఒక్క విద్యార్థి చదువుతోపాటు అన్ని రంగాలలో రాణించాలి యువత యువతీ చెడు మార్గపు వైపు వెళ్లకుండా వారి ఒక లక్ష్యాన్ని నిర్ణయించుకొని మీ బంగారు భవిష్యత్తును తీర్చిదిద్దుకోవాలని కోరారు. భవిష్యత్తులో మీ తల్లిదండ్రులకు మీ గురువులకు మీ గ్రామానికి గద్వాల ప్రాంతానికి మంచి పేరు ప్రతిష్టలు వచ్చే విధంగా ప్రతి ఒక్కరూ కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో మాజీ జడ్పీ చైర్మన్ బండారి భాస్కర్ జిల్లా గ్రంథాలయ మాజీ ఛైర్మన్ జంబు రామన్ గౌడు, మాజీ జెడ్పిటిసి రాజశేఖర్ మాజీ వైస్ ఎంపీపీ రామకృష్ణ నాయుడు, మాజీ కౌన్సిలర్ శ్రీను ముదిరాజ్, నాయకులు షుకుర్, రామాంజనేయులు,దౌలన్న, మొయినుద్దీన్, కోచ్ లు, నాయ కులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## శాఖంబారిగా వెలసిన జమ్ములమ్మ అమ్మవారి దర్శనం చేసుకున్న... జెడ్పి మాజీ చైర్ పర్సన్, కాంగ్రెస్ పార్టీ గద్వాల నియోజకవర్గ ఇంచార్జీ సరితమ్మ..

గద్వాల్, జిల్లా ప్రతినిధి -రమేష్ (శుభోదయం న్యూస్) :





గద్వాల జిల్లా జమ్మిచేడు జములమ్మ అమ్మవారు మరియు పరుశరామ స్వామి ఆలయంలో దేవి శరన్నవరాత్రి వేడుకల్లో భాగంగా శాఖంబారి రూపంలో దర్శనం ఇచ్చిన జమ్ములమ్మ అమ్మవారిని జెడ్పి మాజీ చైర్ పర్సన్, కాంగ్రెస్ పార్టీ గద్వాల నియోజకవర్గ ఇంచార్జీ సరితమ్మ.. దర్శించుకొని తీర్థప్రసాదాలు స్వీకరించారు.. వీరిని మంగళ వాయిధ్యాలు, పూర్ణకుంభంతో దేవాలయ ఈఓ పురేందేర్ ఆలయ అర్చకులు సాధర స్వాగతం పలికారు.అనంతరం కుంకుమ అర్చన చేశారు.వీరి వెంట కాంగ్రెస్ పార్టీ తాజా మాజీ ప్రజాప్రతినిధులు, సీనియర్ నాయకులు తదితరులు ఉన్నారు.

## ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్ రెడ్డి పై చర్యలు తీసుకోవాలి

**జిల్లా ఎస్పీ టి శ్రీనివాసరావుకి పిర్యాదు చేసిన....**

**బి ఆర్ ఎస్ పార్టీ నాయకుడు డాక్టర్ కురువ విజయ్ కుమార్**

గద్వాల్, జిల్లా ప్రతినిధి -రమేష్ (శుభోదయం న్యూస్) :





జోగులాంబ గద్వాల జిల్లా కేంద్రంలోని ఎస్పీ కార్యాలయంలో బి. ఆర్. ఎస్ పార్టీ రాష్ట్ర నాయకుడు డాక్టర్. కురువ విజయ్ కుమార్ ఆధ్వర్యంలో జిల్లా ఎస్పీ శ్రీనివాస్ రావు ని కలసి ఎమ్మెల్యే కృషమోహన్ రెడ్డిపై పిర్యాదు చేశారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పార్టీ ఫిరాయించి పోలీసులకు తప్పుడు పిర్యాదు చేసి,కోర్టులను,తెలంగాణ అసెంబ్లీ స్పీకర్ ను, ఓట్లు వేసిన గద్వాల నియోజకవర్గ ప్రజలను ఉద్దేశపూర్వకంగా కుట్రతో, నేరపూరితంగా మోసం చేసిన గద్వాల ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్ రెడ్డి పై చట్టరీత్యా చర్యలు తీసుకోవాలని పిర్యాదు చేశారు.ఈ కార్యక్రమంలో బి ఆర్ ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.!!

## పండిత్ దీన్ దయల్ ఉపాధ్యాయ జయంతి సందర్భంగా చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళ్లు అర్పించిన బిజెపి మండల ప్రధాన కార్యదర్శి తూర్పాటి మల్లేష్

రేగొండ మండల రిపోర్టర్ మంతెన సురేష్ (శుభోదయం న్యూస్):



రేగొండ మండల కేంద్రంలో బిజెపి మండల ప్రధాన కార్యదర్శి తూర్పాటి మల్లేష్ ఆధ్వర్యంలో పండిత్ దీన్ దయాల్ ఉపాధ్యాయ జయంతి సందర్భంగా పండిత్ దీన్ దయాల్ ఉపాధ్యాయ చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించడం జరిగింది ఈ కార్యక్రమానికి జిల్లా ప్రధాన కార్యదర్శి పెండ్యాల రాజు, తాటికంటి రవి, కిరణ్, ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడుతూ అంత్యోదయ స్ఫూర్తితో దేశ ప్రజల అభివృద్ధి కోసం నిరంతరం శ్రమించిన వ్యక్తి దీన్ దయాల్ ఉపాధ్యాయ గారని జనసంఘ ఏర్పాటు చేసి దేశ ప్రజలను చైతన్యపరిచాడని ఆర్ఎస్ఎస్ ప్రచారకుగా శ్యామ ప్రసాద్ ముఖర్జీ సూచనతో జన సంఘం కార్యదర్శిగా పనిచేశాడని తన మరణాంతరం దేశంలోని అన్ని రాష్ట్రాల అసెంబ్లీలో సంతాప సభలను ఏర్పాటు చేశారని ఉపాధ్యాయ అంత్యోదయ స్ఫూర్తితోనే భారత ప్రధాని గౌరవ శ్రీ నరేంద్ర మోడీ పరిపాలన సాగిస్తున్నాడని అలాంటి మహనీయుడి స్ఫూర్తిగా తీసుకొని యువత ముందుకు సాగాలని వారు అన్నారు ఈ కార్యక్రమంలో కిసాన్ మోర్చా మండల అధ్యక్షులు గన్ రెడ్డి లింగ రెడ్డి, జిల్లా యువ మోర్చా అధ్యక్షులు సయ్యద్ గాలిఫ్, బిజెపి మండల నాయకులు అన్నారపు రమణా రెడ్డి, బూత్ అధ్యక్షులు పున్నం రఘు, సమ్మి రెడ్డి, నాగరాజు, మరియు తదితరులు పాల్గొన్నారు.

## కొండ లక్ష్మణ్ బాబుజి జయంతి పురస్కరించుకొని 27న విగ్రహ ఆవిష్కరణ

రేగొండ మండల రిపోర్టర్ మంతెన సురేష్, (శుభోదయం న్యూస్)



రేగొండ మండలంలో తెలంగాణ ముద్దుబిడ్డ పద్మశాలి కుల బాంధవుడు ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర సాధన కోసం మంత్రి పదవిని సైతం వదులుకొని పోరాడిన కొండా లక్ష్మణ్ బాపూజీ జయంతిని పురస్కరించుకొని ఈనెల 27న జయశంకర్ భూపాలపల్లి జిల్లా కేంద్రంలో విగ్రహావిష్కరణ కార్యక్రమం నిర్వహించడం జరుగుతుంది. కొండా లక్ష్మణ్ బాపూజీ విగ్రహ ఆవిష్కరణ కమిటీ కన్వీనర్ ఎలగొండ రాజేంద్రప్రసాద్, కో కన్వీనర్ అడ్డగట్ల శ్రీధర్, గూట్ల తిరుపతి, ఇప్పకాయల నరసయ్య ఆధ్వర్యంలో నిర్వహించే కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా భూపాలపల్లి శాసనస భ్యులు శ్రీ గండ్ర సత్యనారాయణ రావు హాజరై ఆవిష్కరణ చేయడం జరుగుతుంది. ఈ కార్యక్రమానికి జిల్లాలోని 12 మండలాలకు చెందిన పద్మశాలి కులస్తులు అధిక సంఖ్యలో హాజరు కావాలని కోరుచున్నాము. మరియు మహా అన్నదాన కార్యక్రమం కూడా జరుగును భూపాలపల్లి జిల్లా పద్మశాలి కులాసులు అధిక సంఖ్యలో పాల్గొనగలరు.

## త్రిబుల్ ఆర్ భూ నిర్వాసితుల సమస్యలపై జరుగు మహా ధర్నాను జయప్రదం చేయండి

**-సిర్పంగి స్వామి**

**సిపిఎం మండల కార్యదర్శి**

వలిగొండ మండల రిపోర్టర్ (శుభోదయం న్యూస్):



త్రిబుల్ ఆర్ భూ నిర్వాసితుల సమస్యలపై ఈనెల 27 న భువనగిరి కలెక్టర్ కార్యాల యం ముందు చేపట్టిన మహాధర్నాను జయప్రదం చేయాలని సిపిఎం మండల కార్యదర్శి సిర్పంగి స్వామి కోరారు. గురువారం వర్కట్ పల్లి గ్రామంలో భూ నిర్వాసితులను కలిసి ధర్నాకు ఆహ్వానించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు చిన్న,సన్న కారు రైతుల భూములను రీజినల్ రింగ్ రోడ్డు పేరుతో బలవంతంగా లాక్కునే ప్రయత్నాలను విరమించుకోవాలని డిమాండ్ చేశారు. కార్పొరేట్ పెట్టుబడుదారులకు లాభం చేకూర్చే విధంగా పేదల భూములు గుంజుకోవడం ఏమిటని ప్రశ్నించారు, ప్రభుత్వం మెడలు వంచేందుకు సెప్టెంబర్ 27 న సిపిఎం పార్టీ ఆధ్వర్యంలో భూ నిర్వా సితులతో కలిపి మహాధర్న కార్యక్రమాన్ని నిర్వహించడం జరుగుతుందని,ఈ కార్యక్రమం లో పెద్ద ఎత్తున పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు.సమావేశంలో సిపిఎం గ్రామ శాఖ కార్యదర్శి గూడూరు బుచ్చిరెడ్డి,భూ నిర్వాసితులు సోలిపురం జనార్ధన్ రెడ్డి, మాదుగుల యాదగిరి,మెట్టు రవీందర్ రెడ్డి,టేకు సోమశేఖర్,గంగాధరి శేఖర్, మాదుగుల లచ్చయ్య,రామచంద్రయ్య,గోగు కిష్టయ్య, తదితరులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ కార్యాలయాల్లో చాకలి ఐలమ్మ చిత్రపటం బహుకరణ

వలిగొండ మండల రిపోర్టర్ (శుభోదయం న్యూస్):



యాదాద్రి భువనగిరి జిల్లా వలిగొండ మండల కేంద్రములోని ఎంపీడీవో కార్యాల యంలో ఎంపీడీవో జలేందర్ రెడ్డికి,మండల రెవెన్యూ కార్యాలయంలో పోలీస్ స్టేషన్లో చాకలి ఐలమ్మ జయంతి సందర్భంగా మండల యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు మైసోళ్ళ ప్రవీణ్ కుమార్ ఆధ్వర్యంలో చాకలి ఐలమ్మ చిత్రపటంను బహుకరించారు.ఈ కార్యక్రమం లో భువనగిరి అసెంబ్లీ ప్రధాన కార్యదర్శి బుగ్గ ఉదయ్, మైసొల్ల నవీన్,నరేష్,ప్రశాంత్ వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

# జమ్ములమ్మ సేవలో.. ఎంపీ డి.కే. అరుణమ్మ





గద్వాల్, జిల్లా ప్రతినిధి -రమేష్

(శుభోదయం న్యూస్) :

గద్వాలలోని ప్రముఖ జములమ్మ – పరుశరామ స్వామి ఆలయంలో ఎంపీ డి.కేఅరుణ పూజలు దేవి శరన్నవరాత్రి వేడుకల్లో భాగంగా శాఖంబారి రూపంలో దర్శనం ఇచ్చిన జమ్ములమ్మ అమ్మవారిని దర్శించుకున్న ఎంపీ డి.కే.అరుణమ్మ అరుణమ్మకు మంగళ వాయిద్యాలు, పూర్ణకుంభంతో సాధర స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేసిన ఈ.ఓ పురేందేర్, ఆలయ అర్చకులు మొక్కలు నాటిన అరుణమ్మ...గద్వాల జములమ్మ ఆలయ ఆవరణలో ఎంపీ అరుణమ్మ ఆధ్వర్యంలో సేవాపక్వాడ (స్వచ్ఛ భారత్) కార్యక్రమం ఇందులో భాగంగా గురువారం ఉదయం ఆలయ ఆవరణలో పార్టీ ముఖ్య నేతలతో కలిసి మొక్కలు నాటిన ఎంపీ డి.కే అరుణ ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు రామాంజనేయులు,జిల్లా ప్రధాన కార్యదర్శి శ్యామ్ రావ్, రాష్ట్ర కౌన్సిల్ మెంబర్లు బండల వెంకట రాములు, అక్కల రమదేవి,గద్వాల పోటీ చేసిన అభ్యర్థి బలిగేరా శివారెడ్డి ,జిల్లా బిజెవైఎం అధ్యక్షుడు మీర్జాపురం వెంకటేశ్వర రెడ్డి, జిల్లా ఓబీసీ మోర్చ అధ్యక్షుడు దాస్,పట్టణ అధ్యక్షురాలు రజక జయశ్రీ,మాజీ కౌన్సిలర్ గుర్రం నరసింహులు, మండల అధ్యక్షుడు శ్రీను వాసులు,బిజెపి సీనియర్ నాయకులు చిత్తారి కిరణ్,అనిల్ ,రఘు గౌడ్,అశోక్, రాజు,తదితరులు ఉన్నారు.!!

## చిత్తారమ్మ దేవాలయంలో నవరాత్రి బ్రహ్మోత్సవాలు అంగరంగ వైభవం

రామాయంపేట (శుభోదయం న్యూస్) సెప్టెంబర్ 25:-



మెదక్ జిల్లా రామాయంపేట పట్టణంలోని శ్రీ చిత్తారమ్మ దేవాలయంలో నవరాత్రి బ్రహ్మోత్సవాలు అంగరంగ వైభవంగా కొనసాగుతున్నాయి.ఈ ఉత్సవాలు నాలుగవ రోజు సందర్భంగా అమ్మవారు కూష్మాండ దేవి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు.ఈ సందర్భంగా ఆలయంలో చతుష్షష్టి ఉపచారాలతో కుంకుమార్చన,నిత్యహోమం, మంగళహారతులు నిర్వహించి అమ్మవారిని కోలవడం జరిగింది.అమ్మవారి అలంకారాన్ని తిలకించేందు కు భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి భక్తిశ్రద్ధలతో ప్రత్యేక పూజలు చేశారు.దేవాలయ పరిసరాలు జైజయకారాలతో మారుమ్రోగగా వేదమంత్రోచ్చారణల మధ్య భక్తులకు ఆధ్యాత్మిక వాతావరణం నెలకొంది.బ్రహ్మోత్సవాల సందర్భంగా ప్రతిరోజు భిన్న అలంకారాల్లో అమ్మవారు దర్శనమిస్తూ భక్తులకు కటాక్షం కురిపిస్తున్నారు.రేపు ఐదవ రోజు ఉత్సవాలలో ప్రత్యేక పూజా కార్యక్రమాలు, సాంస్కృతిక వేడుకలు నిర్వహించనున్నట్లు దేవాలయ కమిటీ సగర సభ్యులు తెలిపారు.

## జిఎస్టి విషయంలో ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్న బిజెపి నాయకులు

**టిపిసిసి అధికార ప్రతినిధి పల్లె రామచంద్రం గౌడ్**

రామాయంపేట (శుభోదయం న్యూస్) సెప్టెంబర్ 25:-



జీఎస్టీ తగ్గిస్తున్నామని బిజెపి ప్రజా ప్రతినిధులు నాయకులు ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నారని టీపీసీసీ అధికార ప్రతినిధి పల్లె రామచంద్రం గౌడ్ అన్నారు.మెదక్ ఎంపీ రఘునందన్ రావు రామాయంపేటలో చెప్పిన విషయాలు పూర్తిగా అబద్ధమన్నారు.కేంద్ర ప్రభుత్వం జీఎస్టీ విషయంలో 8 సంవత్సరాల పాటు లక్షల కోట్లు దోపిడీకి పాల్పడిందన్నారు.కొండంత దోచి గోరంత పంచినట్లు జిఎస్టి విషయంలో ఉత్సాహం చూపడం మానుకోవాలన్నారు.అలాగే బీసీలకు 42% రిజర్వేషన్ల విషయంలో రాష్ట్రంలో బిఆర్ఎస్,బిజెపి మద్దతు ఇచ్చినట్లే ఇచ్చి కేంద్రంలో బిల్లు అమలు కాకుండా అడ్డు పడుతున్నాయన్నారు.బిల్లు ఆమోదం విషయంలో గవర్నర్, రాష్ట్రపతి వద్ద అడ్డంకులు సృష్టించి బీసీలకు అన్యాయం చేయడంలో ప్రముఖపాత్ర పోషించడం ఆ పార్టీలకు మంచిది కాదన్నారు.కేవలం ధనవంతులకు మాత్రమే మేలు చేసే విధంగా జిఎస్టి అమలు చేస్తున్నారని ఇది పూర్తిగా పేద ప్రజల మధ్య తరగతుల వారి మీద పెనుబారంగా మారుతుందన్నారు.ఇప్పటికైనా బిఆర్ఎస్, బిజెపి పార్టీలు ప్రజలను మభ్యపెట్టకుండా అసత్య ప్రచారాలు చేయడం మానుకోవాలన్నారు.

## సద్దలోనిపల్లి గ్రామ యువ నాయకులు బిజెపి పార్టీలో చేరిక...!!





**మహబూబ్నగర్ ఎంపీ.డీకే.అరుణమ్మ సమక్షంలో..**

గద్వాల్, జిల్లా ప్రతినిధి -రమేష్

(శుభోదయం న్యూస్) :

జోగులాంబ గద్వాల జిల్లామల్దకల్ మండలం సద్దలోని పల్లి గ్రామ యువ నాయకులు నిన్న మహబూబ్నగర్ పార్లమెంట్ సభ్యురాలు డీకే.అరుణమ్మ సమక్షంలో బిజెపి పార్టీలో సద్దలోని పల్లి గ్రామ యువ నాయకులు 30 మంది చేరారు. మరియు జాతీయ పార్టీ అయిన బిజెపి పార్టీలో నరేంద్రుడు చేపట్టిన పథకాలు ముందు భవిష్యత్తులో బిజెపి పార్టీతోనే సాధ్యమని భావించి, పార్టీలో చేరినట్లు తెలుస్తోంది.ఈ కార్యక్రమంలో గవుళ్ళ కర్రెన్న నరసింహులు, ఉత్తనూరు కృష్ణయ్య, గవుళ్ళ నరసింహులు, కృష్ణంరాజు, బంట్రోతు లావన్న, బోయ భాస్కర్, అడవి రావులచెరువు దరిసెల్లి, గుడిసె శంకర్, గిరిని జయన్న,గౌవుల శేషు,గొల్ల వెంకటేష్, పాలయి మాజీ ఎంపీటీసీ రాములు, తదితరులు పాల్గొ న్నారు.

## నేటి యువత భగత్ సింగ్ స్ఫూర్తితో పయనించాలి

**-ఏఐవైఎఫ్ జిల్లా అధ్యక్షులు ఎల్లంకి మహేష్**

వలిగొండ మండల రిపోర్టర్ (శుభోదయం న్యూస్):



నేటి యువత భగత్ సింగ్ పోరాట స్ఫూర్తితో పయనించాలని ఏఐవైఎఫ్ జిల్లా అధ్యక్షులు ఎల్లంకి మహేష్అన్నారు.దుప్పల్లి గ్రామ శాఖ సమావేశం బుధవారం మునుగోటి చంద్ర అధ్యక్షతన నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథులుగా ఎల్లంకి మహేష్ హాజరై మాట్లాడుతూ ఈనెల 28 షాహిద్ భగత్ సింగ్ 118 వ జయంతి వేడుకలను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అధికారికంగా నిర్వహించాలని ఆయన డిమాండ్ చేశారు. షహీద్ భగత్ సింగ్ సెప్టెంబర్ 28 న మన దేశంలో జన్మించారని,దేశ స్వాతంత్ర్యం కోసం ఉరికొయ్యలను సైతం లెక్కచేయకుండా, భవిష్యత్తు తరాల కోసం బ్రిటీష్ ముష్కరులను ఎదిరించి వీరోచిత పోరాటాలు చేసి వీరమరణం పొందరన్నారు. కానీ నేడు భగత్ సింగ్ కలలుగన్న స్వరాజ్య ఆకాంక్షలకు అనుగుణంగా నేటి విద్యార్థులు,యువత పయనుంచడం లేదని ఆవేదన వ్యక్తంచేశారు. దేశానికేఆదర్శప్రాయుడైన భగత్ సింగ్ స్ఫూర్తితో నేటి యువత చెడు మార్గాలను,చెడు అలవాట్లను విడనాడాలని ఆయన పిలుపునిచ్చారు. అనంతరం నూతన అఖిలభారత యువజన సమాఖ్య గ్రామ కమిటీ వేసి,గ్రామ శాఖ అధ్యక్ష కార్యదర్శులు మెట్టు లక్ష్మీ నారాయణ, బాలగోని రాజు, కోశాధికారి పూదూరి అశోక్, కార్యవర్గ సభ్యులు కన్నబోయిన పృథ్వీరాజ్,ఎర్ర కిరణ్, సిరబోయిన శంకర్, ఎర్ర వినయ్,అంతటి రాము,ఎల్లంకి చంద్రశేఖర్ లను ఎన్నుకున్నారు.ఈ కార్యక్రమంలో సిపిఐ గ్రామ శాఖ కార్యదర్శి కట్లయాదగిరి,ఏఐవైఎఫ్ మండల అధ్యక్ష కార్యదర్శులు మారోజు నరసింహాచారి, సుద్దాల సాయికుమార్, సిపిఐ నాయకులు కావేటి సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

## భారతీయ మజ్దూర్ సంఘ్ (బిఎంఎస్) జిల్లా అధ్యక్షులు గా...బొమ్మనవేని చంద్రమౌళి, పెద్దపల్లి జిల్లా కార్యదర్శిగా సాయవేణి సతీష్ నియామకం





గోదావరిఖని టౌన్, రిపోర్టర్- (శుభోదయం న్యూస్):

భారతీయ మజ్దూర్ సంఘ్( బి ఎం ఎస్) పెద్దపల్లి జిల్లా నూతన కమిటీ ఎన్నిక బుధవారం గోదావరిఖనిలో బిఎంఎస్ రాష్ట్ర అధ్యక్షులు కలాల్ శ్రీనివాస్ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో కమిటీని ఎన్నుకున్నారు.జిల్లా అధ్యక్షునిగా బొమ్మనవేని చంద్రమౌళి, కార్యదర్శిగా సాయవేని సతీష్, కోశాధికారి చల్లా సత్య నారాయణ రెడ్డి, ఉపాధ్యక్షులు వై రాజు,భండారి శ్యామ్ సుందర్, మనోహర్, సహాయ కార్యదర్శులుగా మీనుగు సంతోష్,అవుల సతీష్, జలేంధర్,కమిటీ ప్రకటించారు.ఈ కార్యక్రమంలో రాష్ట్ర అధ్యక్షులు కలాల్ శ్రీనివాస్, సంఘటన కార్యదర్శి జె. రామ్మోహన్,ఏ బి కె ఎం ఎస్ ఆడిటర్ మండ రమా కాంత్ తో పాటు బిఎంఎస్ దాని అను బంధ సంఘ నాయకులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా నూతన కమిటీ సభ్యులు మాట్లాడుతూ రాష్ట్ర నాయకత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. నాయకత్వం తమపై ఉంచిన నమ్మకాన్ని పెంచేలా పనిచేస్తామని ధీమా వ్యక్తం చేశారు.

## బిజెపిని విమర్శించే నైతిక హక్కు సిపిఎం పార్టీకి లేదు


వలిగొండ మండల రిపోర్టర్ (శుభోదయం న్యూస్):



భారతీయ జనతా పార్టీ వలిగొండ మండల అధ్యక్షుడు బోళ్ల సుదర్శన్ బిజెపిని విమర్శించే నైతిక హక్కు సిపిఎం పార్టీకి లేదు అని విమర్శించారు. వలిగొండ మండల కేంద్రంలో సిపిఎం పార్టీ శిక్షణా తరగతుల్లో సిపిఎం పార్టీ రాష్ట్ర నాయకులు బండారు రమేష్ మాట్లాడుతూ భారతీయ జనతా పార్టీ దేశంలో మతం పేరుతో రాజకీయాలు చేసి ప్రజల మధ్యన విద్వేషాలు సృష్టిస్తుందని అసత్య ఆరోపణలు చేయడం జరిగింది. భారతీయ జనతా పార్టీ వలిగొండ మండల పార్టీ అధ్యక్షుడు మాట్లాడుతూ అయ్యా రమేష్ మీరు పాలిస్తున్నటువంటి కేరళ రాష్ట్రంలో స్వయం సేవకుల పైన భారతీయ జనతా పార్టీ కార్యకర్తల పైన జరుగుతున్నటువంటి దాడులను దృష్టిలో పెట్టుకొని మాట్లాడండి, అని మైకు దొరికింది కదా ఏది పడితే అది మాట్లాడతానేఉద్దేశంతో మాట్లాడితే పార్టీ చూస్తూ ఊరుకోదని హెచ్చరించారు. అయినా దేశంలో 18 రాష్ట్రాలను పాలిస్తున్నటువంటి భారతీయ జనతా పార్టీని మతం పేరుతో అల్లర్లు సృష్టిస్తున్న అనడం సిగ్గుచేటని, దాని సిద్ధాంతాలను విమర్శించే నైతిక హక్కు మీసిపిఎం పార్టీకి లేదని తీవ్రంగా విమర్శించారు.

## ఏ టి సి సెంటర్ ను సందర్శించిన రామగుండం శాసనసభ్యులు మక్కాన్ సింగ్ రాజ్ ఠాకూర్

రామగుండం మండలం, రిపోర్టర్- (శుభోదయం న్యూస్):



రామగుండం నియోజకవర్గం శాసనసభ్యులు మక్కాన్ సింగ్ రాజ్ ఠాకూర్ రామగుండం ఏటీసీ సెంటర్ ను గురువారం రోజున సందర్శించారు.రేపు తెలంగాణ రాష్ట్రంలో మన రాష్ట్ర ముఖ్యమంత్రి గౌరవనీయులు శ్రీ రేవంత్ రెడ్డి ఏటీసీ సెంటర్లను ప్రారంభించనున్న నేపథ్యంలో, మన రామ గుండం ఏటీసీ సెంటర్ ను పరిశీలించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే రాజ్ ఠాకూర్ మాట్లాడుతూ, రామగుండం ప్రాంతానికి ఈ ఏటీసీ సెంటర్ ఎంతో మేలు చేస్తుందని, భవిష్యత్తులో ఈ సెంటర్ ద్వారా మరిన్ని సదుపాయాలు కల్పించేలా అభివృద్ధి పనులు చేపడతానని తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు మరియు స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

## రామగుండం అభివృద్ధిపై సమీక్ష సమావేశం నిర్వహించిన...రామగుండం ఎమ్మెల్యే మక్కాన్ సింగ్ రాజ్ ఠాకూర్

గోదావరిఖని టౌన్, రిపోర్టర్- (శుభోదయం న్యూస్):



రామగుండం నియోజకవర్గ శాసనసభ్యులు ఎం.ఎస్. రాజ్ ఠాకూర్ గురువారం రోజున గోదావరిఖని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో రామగుండం అభివృద్ధి పై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో పంచాయతీ రాజ్, ఆర్ బీ, మున్సిపల్ అధికారులు, డీఈ, ఏఈలతో కలిసి వివిధ అభివృద్ధి పనులపై చర్చించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రామగుండం నియోజక వర్గంలో జరుగుతున్న అభివృద్ధి పనులు వేగవంతంగా, నాణ్యతా ప్రమాణాలతో పూర్తి కావాలని సూచించారు. ప్రజలకు తక్షణ అవసరమైన మౌలిక సదుపాయాలపై అధికారులు ప్రత్యేక దృష్టి పెట్టాలని ఆదేశించారు. ముఖ్యంగా రహదారుల మరమ్మతులు, కాలువలు, డ్రైనేజీ వ్యవస్థ, తాగునీటి సరఫరా, పంచాయతీ రాజ్ మరియు మున్సిపల్ పరిధిలో జరుగుతున్న పనులను సమగ్రంగా సమీక్షించి అధికారులు తగిన చర్యలు తీసుకోవాలని సూచించారు. అభివృద్ధి పనులలో ఎలాంటి నిర్లక్ష్యం జరిగితే సహించేది లేదని ఎమ్మెల్యే హెచ్చరించారు. ప్రజలకు సకాలంలో సౌకర్యాలు అందించడం ప్రభుత్వ ప్రాధాన్య కర్తవ్యమని ఆయన తెలిపారు.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులు, స్థానిక ప్రముఖులు పాల్గొన్నారు.

## వీధి సింహాల స్వైరవిహారం

బీర్కూర్,మండలం రిపోర్టర్ (శుభోదయం న్యూస్):



కామారెడ్డి జిల్లా బీర్కూర్ మండల వ్యాప్తంగా వీధికుక్కల బెడద తీవ్రస్థాయి కి చేరింది. గురువారం రోజు బరంగేడిగీ గ్రామంలో ఒక వ్యక్తి కుక్కల దాడి లో తీవ్రంగా గాయపడ్డ ఘటన చోటు చేసుకుంది. ఎడిగి గ్రామం లో ఉదయం ఒక వ్యక్తి తన ఇంటి ముందు నిలబడి ఉండగా వీధిసింహాలు ఒకే సారి దాడి చేశాయి. తీవ్రంగా గాయపడ్డ ఆయనకు చికిత్స నిమిత్తం బాన్సువాడ ఏరియా ఆసుపత్రి కి తరలించినట్టు కాలని వసూలు తెలిపారు. చిన్న పిల్లలకు వృద్ధులు బయటకు రావాలంటే జంకుతున్నారు అని కాలనీ వాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అనేక సార్లు పలు పేపర్లలో విధికుక్కల పైన వార్తలు వచ్చిన పట్టించుకునే నాధుడే కరువయ్యారు అని ఇకనైన సమస్య తీవ్ర స్థాయికి చేరకముందే సంబంధిత అధికారులు తక్షణమే వాటి పైన చర్యలు తీసుకోవాలని మండల ప్రజలు కోరుతున్నారు.

# జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డ్ 2025 గడ్డం జగదీశ్వర్ కు ఘన సన్మానం

**శారదా ఎడ్యుకేషనల్ సొసైటీ, హైదరాబాద్ వారి ఆధ్వర్యంలో**

గోదావరిఖని టౌన్, రిపోర్టర్- (శుభోదయం న్యూస్ న్యూస్):



ఈ నెల 25న హైదరాబాద్ లోని లక్డికాపూల్, బిర్లా ప్లానిటోరియం లోని, భాస్కరా ఆడిటోరియం లో జరిగిన శారదా ఎడ్యుకేషనల్ సొసైటీ హైదరాబాద్ వారి ఆధ్వర్యంలో జరిగిన నేషనల్ టీచర్స్ ఎక్సెలెన్స్ అవార్డు -2025 జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డుకు ఎంపికైన గడ్డం జగదీశ్వర్ ను ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఉపాధ్యాయ ఎం. ఎల్.సి. మలక కొమురయ్య జగదీశ్వర్ సేవలు కొనియాడుతూ ఘన సన్మానం చేశారు. పెద్దపల్లి జిల్లా నుండి ఉత్తమ ఉపాధ్యాయ అవార్డ్ పొందిన జగదీశ్వర్ ను ప్రతేకంగా అభినందించారు. శారదా ఎడ్యుకేషనల్ హైదరాబాద్ వారు ప్రత్యేక అభినందనలు తెలిపారు. జగదీశ్వర్ స్వగ్రామం కరీంనగర్ జిల్లా, మానకొండూరు మండలం కొండపలకల గ్రామం. పూర్వపు కరీంనగర్ జిల్లాలో కూడా జిల్లా ఆంగ్లం రిసోర్స్ పర్సన్ గా రాణించిన గడ్డం జగదీశ్వర్ ప్రస్తుతం పెద్దపల్లి జిల్లా లో కూడా ఆంగ్లం సబ్జెక్ జిల్లా రిసోర్స్ పర్సన్, రామగుండం మండలం ప్రాథమికోన్నత పాఠశాల దుర్గయ్యపల్లి, అన్నపూర్ణ కాలనీ. ఎన్. టి. పి. సి. లో ఆంగ్లం ఉపాధ్యాయుడు ఈ ప్రతిష్టాకరమైన అవార్డ్ అందుకున్న గడ్డం జగదీశ్వర్ ను జిల్లా స్థాయి అధికారులు, ఉపాధ్యాయ సంఘాల ప్రతినిధులు, సహచర ఉపాధ్యాయులు స్నేహితులు అభినందనలు తెలిపారు. జగదీశ్వర్ ఆంగ్లం సబ్జెక్టు బోధిస్తున్న ప్రతి ఇన్నోవేటివ్, లక్ష్యాత్మక బోధన విధానాలను, టెక్నాలజీ బోధనా వ్యూహాలు, పాటిస్తూ విద్యార్థులకు ఆంగ్లం సబ్జెక్ లో మంచి మార్గ దర్శకత్వం వహిస్తు, అద్భుతమైన ఫలితాలు సాధిస్తూ, ఉపాధ్యాయ లోకానికి ఆదర్శంగా నిలుస్తూ, ఉపాధ్యాయులను ప్రోత్సహిస్తూ క్వాలిటీ ఎడ్యుకేషనల్ వ్యూహాలను అమలు చేయాలని, ప్రభుత్వ లక్ష్యం నెరవేరే విధంగా విద్యా ప్రణాళికలు రూపొందించాలని, అర్థవంతమైన బోధనా వ్యూహాలు అమలు చేయాలని తోటి ఉపాధ్యాయులకు అవగాహన కల్పిస్తూ విద్యా రంగానికి గతంలో పది సంవత్సరాలు ప్రైవేట్ ఉపాధ్యాయుడిగా పనిచేసి వివిధ పాఠశాలల నుండి ప్రశంసలు అందుకొని ప్రస్తుతం 26 సంవత్సరాలుగా ప్రభుత్వ ఉపాధ్యాయుడిగా విశిష్ట సేవలు అందిస్తున్న, వీరు ఎక్కడ పనిచేసినా సమయ పాలన పాటిస్తూ, అంకిత భావంతో దృఢదీక్ష తో పనిచేస్తూ, ఇంటి0టా చదువుల పంట, పాఠం వింటారు కథ చెబుతారు లాంటి సృజనాత్మక కార్యక్రమాల పేరుతో విద్యార్థులకు ఇంటింటికీ లైబ్రరీ పుస్తకాలు (ఇంటింట విజ్ఞాన బాండాగారం ) అందించి పుస్తక సమీక్షలో విద్యార్థుల సర్వతోముఖాభివృద్ధి పాటుపడుతూ, కరోనా కాలంలో కూడా ఆన్లైన్ క్లాసెస్, జూమ్ క్లాసెస్ నిర్వహించి జాతీయ స్థాయి కథల పోటీలో విద్యార్థులను పాల్గొనేలా చేసి ప్రశంస పత్రాలు మరియు నగదు బహుమతులు పొందేలా కృషి చేసినారు. కరోనా కాలంలో ఎన్.ఎం.ఎం.ఎస్. స్కాలర్షిప్ కొరకు ఆన్లైన్ క్లాసెస్ నిర్వహించి స్కాలర్ షిప్ వచ్చే విధంగా శిక్షణ ఇచ్చి సఫలీకృతులయ్యారు. సెంటర్ ఫర్ కల్చరల్ రిసోర్సెస్ అండ్ ట్రెయినింగ్ కోర్సెస్ అస్సాం రాష్ట్రంలోనీ గౌహతి, హైద్రాబాద్ మరియు రాజస్థాన్ రాష్ట్రం లోని ఉదయపూర్ లాంటి జాతీయ శిక్న కేంద్రాలలో ట్రైనింగ్ కొరకు ఎంపికై హాజరైన వీరు సృజనాత్మక వ్యూహాలతో విద్యాభివృద్ధికి కృషి చేస్తున్న ఇంతటి ప్రతిభ కలిగిన జగదీశ్వర్ జాతీయ స్థాయి ఉపాధ్యాయుల సమావేశాలకు హాజరై ఉత్తమ ప్రతిభ కనబరచిన జగదీశ్వర్ మండల, జిల్లా స్థాయి ఉత్తమ ఉపాధ్యాయ అవార్డ్, ప్రాథమిక ఉపాధ్యాయ సంఘం ఆధ్వర్యంలో రాష్ట్ర స్థాయి అవార్డ్, లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో ప్రశంసలు, డాక్టర్ ఏ.పి.జే. అబ్దుల్ కలామ్స్ మిషన్ " లీడ్ ఇండియా ఫౌండేషన్ " నేషనల్ లెవల్ బెస్ట్ టీచర్ " అవార్డ్, నేషనల్ యూత్ ప్రాజెక్ట్ వారి " గురు దేవో భవ " అవార్డ్, త్రేతా యుగ ఫౌండేషన్ వారి ఆధ్వర్యంలో డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ విజనరి బెస్ట్ టీచర్ అండ్ మెంటార్ అవార్డ్, ఇవే కాకుండ " గ్రామీణ కళాజ్యోతి " అవార్డ్, శాతవాహన కళా ఉత్సవాల సందర్భంగా ప్రశంసలు ఇలా వివిధ సంస్థల ఆధ్వర్యంలో మన్ననలు, అవార్డ్స్ పొందుతూ ఆంగ్లం సబ్జెక్ జిల్లా, స్టేట్ రిసోర్స్ పర్సన్ గా, డిజిటల్ లెసన్ ప్రెజెంటర్ గా, రీజినల్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ సౌత్ ఇండియా, బెంగుళూర్ లో నాలుగు నెలల పాటు సర్టిఫికెట్ ఇన్ ఇంగ్లీష లాంగ్వేజ్ టీచింగ్ శిక్షణ పొందిన వీరు, ఆధునిక టెక్నాలజీ అందిపుచ్చుకుంటూ ఉపాధ్యాయులను, విద్యార్థులను విద్యా విషయాలపై ప్రోత్సహిస్తూ, ఇతను పనిచేసిన ప్రతి పాఠశాలలో "ఒక నిమిషం ఇంగ్లీష మాట్లాడుట " అంశమును ప్రత్యేక పఠనంగా డిజిటల్ టెక్నాలజీ అందిపుచ్చుకుంటూ, వాట్సాప్ గ్రూపులలో ఆంగ్లం సబ్జెక్ బోధన విధానాలను ప్రాథమిక, ప్రాథమికోన్నత ఉన్నత పాఠశాలల ఆంగ్లం ఉపాధ్యాయులను ప్రోత్సహిస్తూ,ఉత్తేజిత పరుస్తూ,ఉపాధ్యాయ శిక్షణలైన నిష్ట, ఉన్నతి, కెపాసిటీ బిల్డింగ్ ట్రైనింగ్ లలో, కాంప్లెక్ సమావేశాలలో టీచింగ్ లెర్నింగ్ మెటీరియల్ మేళాలు నిర్వహిస్తూ జిల్లా రిసోర్స్ పర్సన్గా కీ రోల్ పోషిస్తూ, పెద్దపల్లి జిల్లా ఇంగ్లీష లాంగ్వేజ్ టీచర్స్ అసోసియేషన్ ఫౌండర్గా గత పది సంవత్సరాలుగా అనేక కార్యక్రమాలు స్పెల్ బీ, ఇంగ్లీష ఒలింపియాడ్ లాంటి సృజనాత్మక కార్యక్రమాలను చేపడుతూ, " ఎల్టా ఐ పాస్ బుక్లెట్" లో పదవ తరగతి విద్యార్థులకు ఉపయోగపడే ప్రత్యేక పరీక్షంశాలు రూపొందిస్తూ పుస్తకంలోని అంశముల రచయితగా రానిస్తూ, విద్యార్థుల ఆంగ్లం భాషలో సర్వతో ముఖాభివృద్ధికి, విద్యారంగానికి విశిష్ట సేవలు అందిస్తు, హరితహారం, మొక్కల పెంపకం, విద్యార్థుల కోసం కృషి చేస్తూ, సహ పాఠ్యంశాలు ఐన సాంస్కృతిక మరియు స్కౌట్స్ అండ్ గైడ్స్ కార్యక్రమాలలో హైద్రాబాద్ మరియు మధ్యప్రదేశ్ లోని పచ్మరి లో స్కౌట్స్ అండ్ గైడ్స్ ట్రైనింగ్ కౌన్సిలర్ శిక్షణ పొందిన వీరు పాఠశాలల్లో ఇంప్లిమెంటేషన్ చేస్తూ స్కౌట్స్ లక్ష్యాలు నెరవేరడానికి విద్యార్థుల్లో క్రమశిక్షణ దేశభక్తి పెంపొందేలా అభివృద్ధి పథాన నడిపిస్తు, పెద్దపల్లి జిల్లా విద్యాధికారి కార్యాలయంలో సమగ్రశిక్ష క్వాలిటీ కోఆర్డినేటర్, జిల్లా అకడమిక్ మానిటరింగ్ ఆఫీసర్ గా సమర్థవంతంగా పనిచేసి, పాఠశాలల అభివృద్ధి కి కృషి చేసిన వీరు జిల్లా, రాష్ట్ర అధికారులచే మన్ననలు పొందుచున్న గడ్డం జగదీశ్వర్ కు ఈ అవార్డ్ రావడం జిల్లా విద్యా సంస్థలు, విద్యాభిమానులు,విద్యార్థులు, యువత, మేధావులు, కుటుంబ సభ్యులు ప్రత్యేక అభినందనలు తెలిపారు.

# క్రీడాకారులకు అండగా నిలిచిన ఎమ్మెల్యే జిఎంఆర్

**దక్షిణాది క్రీడా పోటీలకు హాజరవుతున్న క్రీడాకారులకు 70 వేల రూపాయల ఆర్థిక సహాయం**

పటాన్చెరు, (శుభోదయం న్యూస్):



ప్రతి విద్యార్థి జీవితంలో క్రీడలు భాగస్వామ్యం కావాలని నియోజకవర్గ పరిధిలోని క్రీడాకారుల అభివృద్ధికి అనునిత్యం అండగా నిలుస్తున్నామని పటాన్చెరువు శాసనసభ్యులు గూడెం మహిపాల్ రెడ్డి తెలిపారు. గుమ్మడిదల మండల పరిధిలోని కానుకుంట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన ఫాతిమా, కీర్తన, ఆకాంక్ష, లావణ్య, స్మితిక విద్యార్థులు ఇటీవల జరిగిన ఖేలో ఇండియా ఉషా రాష్ట్ర స్థాయి పోటీలలో బంగారు, వెండి పతకాలతో సాధించారు. త్వరలో తమిళనాడులో జరగనున్న సౌత్ జోన్ నేషనల్ పోటీలలో పాల్గొనేందుకు ఎమ్మెల్యే జిఎంఆర్ అండగా నిలిచారు. బుధవారం సాయంత్రం పటాన్చెరు పట్టణంలోని క్యాంపు కార్యాలయంలో క్రీడాకారులను అభినందించడంతోపాటు.. 70 వేల రూపాయల ఆర్థిక సహాయం అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పటాన్చెరు నియోజకవర్గాన్ని క్రీడలకు కేంద్రంగా తీర్చిదిద్దుతున్నామని తెలిపారు. విద్యతోపాటు క్రీడలకు అధిక ప్రాధాన్యత ఇవ్వడంతో పాటు.. మండల కేంద్రాల్లో అన్ని వసతులతో స్టేడియాలు నిర్మిస్తున్నామని తెలిపారు. జిల్లా, రాష్ట్ర, జాతీయ స్థాయి క్రీడలలో పాల్గొని విద్యార్థులకు ఆర్థిక సహాయంతో పాటు అండగా నిలుస్తున్నామని తెలిపారు. ఈ సందర్భంగా వ్యాయామ ఉపాధ్యాయురాలు విజేత కుమారిని అభినందించారు. ఈ కార్యక్రమంలో జిల్లా పరిషత్ మాజీ వైస్ చైర్మన్ ప్రభాకర్, అమీన్పూర్ మాజీ జెడ్పిటిసి సుధాకర్ రెడ్డి, అమీన్పూర్ మున్సిపల్ మాజీ చైర్మన్ పాండురంగారెడ్డి, గూడెం మధుసూదన్ రెడ్డి, అశోక్, పరమేష్ యాదవ్, పెద్ద రాజు, తదితరులు పాల్గొన్నారు.

# స్వచ్ఛతా హీ సేవలో భాగంగా గోదావరి నది పుష్కర ఘాట్ వద్ద సమగ్ర పరిశుభ్రత డ్రైవ్





**రామగుండం నగరపాలక సంస్థ డిప్యూటీ కమిషనర్ నాయిని వెంకటస్వామి**

రామగుండం మండలం, రిపోర్టర్ - (శుభోదయం న్యూస్):

సమిష్టి కృషితో స్వచ్చత సాధ్యమని రామగుండం నగర పాలక సంస్థ డిప్యూటీ కమిషనర్ నాయిని వెంకట స్వామి అన్నారు. స్వచ్ఛతా హీ సేవలో భాగంగా గురువారం గోదావరి నది పుష్కరఘాట్ వద్ద నిర్వహించిన "ఏక్ దిన్ ఏక్ ఘంటా ఏక్ సాత్: నేషన్వైడ్ వాలంటరీ శ్రమధాన్" కార్యక్రమంలో నగర పాలక సంస్థ సిబ్బంది మెప్మా సిబ్బంది పాల్గొని సమగ్ర పరిశుభ్రత డ్రైవ్ చేపట్టి ఒడ్డున ఉన్న ప్లాస్టిక్ చెత్త ఏరి వేశారు. ఈ సందర్భంగా నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ, పర్యావరణ పరిరక్షణ, పరిశుభ్రతా క్రమ శిక్షణ సంస్కృతిని ప్రోత్సహించడానికి నిర్వహిస్తున్న ఈ కార్యక్రమం ఒక మైలు రాయి అని అన్నారు. ఈ కార్యక్రమం సమిష్టి కృషి శక్తి ని నిరూపించిందని అన్నారు. నగర పాలక సంస్థ అసిస్టెంట్ కమిషనర్ వెంకటేశ్వర్లు సెక్రెటరీ ఉమా మహేశ్వర్ రావు ఎన్విరాన్ మెంటల్ ఇంజనీర్ మధుకర్ ఎం ఐ ఎస్ ఆపరేటర్ శ్రీకాంత్ మెప్మా సి ఓ లు ఊర్మిళ శ్వేత. ప్రియ దర్శిని వార్డు అధికారులు సానిటరీ జవాన్లు ఎకో వారియర్స్ ప్రతినిధులు శివ కృష్ణ కరుణా కర్ మహేందర్ తదితరులు పాల్గొన్నారు.

## షెడ్యూల్ ఏరియాలో ఏ 4 మద్యం షాపులు డిడిలు డ్రాలు లేకుండా మినహాయిస్తూ పెసా

**గ్రామ సభల ద్వారా లబ్ధిదారుల ఎంపిక ప్రభుత్వం జరపాలి**

మంగపేట,మండల రిపోర్టర్- తులసి( శుభోదయం న్యూస్ ):



షెడ్యూల్ ఏరియా లో గల మద్యం షాపులు. మన ఆదివాసి నిరుద్యోగ యువకులు మహిళల. ఏజెన్సీ సర్టిఫికెట్ తీసుకొని డి.డి.లు వేస్తున్న. మద్యం మాఫియా సిండికేట్. గ్యాంగ్. ఆదివాసి సంఘాల మిత్రులారా. సమతా జడ్జిమెంట్ 1997. సుప్రీం కోర్ట్ అత్యున్నత న్యాయ స్థానం షెడ్యూల్ ఏరియాలో. ప్రభుత్వమే. ఒక గిరిజనేతరుడు కిందికి. వర్తిస్తుంది అని. జడ్జిమెంట్ ఆర్డర్లో ఉంది.కానీ ఇక్కడ ఏజెన్సీలో.ఎక్సైజ్ శాఖ అధికారులు. ప్రభుత్వానికి తప్పుడు నివేదిక ఇస్తూ. డిడి లా మీద డ్రా పేరిట. షెడ్యూల్ ఏరియా షాపుల మీద.వందల కోట్ల రూపాయలు వసూలు చేస్తు.గిరిజన చట్టాలకు విరుద్ధంగా చేస్తున్నారు. ఏజెన్సీలో ఉన్న గిరిజనులు అంటేనే. వెనుకబడిన అట్టడుగు అమాయక ఆదివాసీలు అని అర్థం. ప్రస్తుతం. 20 25. సంవత్సరం నుండి. 2027 సంవత్సరం వరకు. నిర్వహించే. ఏజెన్సీ మద్యం షాపులు, ఒక డీడీపై.3 లక్షల రూపాయలు.గిరిజనులు ఏ విధంగా వేస్తారో.ఎక్సైజ్ శాఖ అధికారులు సమాధానం చెప్పాలి. ఎక్సైజ్ శాఖ అధికారులు ఉసిగొలుపుతున్నది. మద్యం మాఫియా సిండికేట్ గ్యాంగ్ అని. అర్థమయిపోయింది.మా ఆదివాసులకు.లైసెన్స్ హోల్డర్ గా.ఆదివాసి పేర్ల మీద ఇచ్చి.మద్యం మాఫియా గ్యాంగ్. షాపులు నడుపుతుంటే. ఎటువంటి చర్యలు తీసుకోరు. అంతేకాకుండా.ములుగు జిల్లా ఏజెన్సీలో.నాన్ ఏజెన్సీ గ్రామాలు ఉన్నాయని. గెజిట్ నోటిఫికేషన్ విడుదల చేస్తూ.ప్రభుత్వానికి తప్పుడు నివేదికలు ఇస్తూ.గిరిజన చట్టాలకు విరుద్ధంగా పనిచేస్తున్నారు.ఈ ఎక్సైజ్ అధికారులు.పిసా యాక్ట్ 1996.. రూల్స్ 2011.లో.మద్యం షాపుల లబ్ధిదారుడు ఎంపిక. పిసా గ్రామ సభ తీర్మానం చేయాలని స్పష్టంగా ఉంది.. దీనిని. ప్రభుత్వం ఎక్సైజ్ శాఖ అధికారులు అమలు చేయాలని. మొదటగా ఏజెన్సీలో మద్యం షాపులు ఎక్కడైతే ఉన్నాయో.ఈ విధంగా పీసా గ్రామసభ తీర్మానాలు చేయండి.తీర్మానం చేసిన కాపీలను.ములుగు జిల్లా కలెక్టర్.ఎక్సైజ్ సూపర్ డెంటెంట్. భూపాలపల్లి. ఐటీడీఏ పిఓ.రాష్ట్ర ఎక్సైజ్ శాఖ కమిషనర్.రాష్ట్ర ఎక్సైజ్ శాఖ మంత్రి. రాష్ట్ర. గవర్నర్.దరఖాస్తులు ఇచ్చి. తెలంగాణ హైకోర్టు. ఉన్నత న్యాయస్థానంలో. ఏజెన్సీ మద్యం షాపులపై. కేసు నమోదు చేద్దాం

## ఆర్థిక సహాయం అందించిన సమాజ సేవకులు : చాకలి శ్రీనివాస్...

దోమ, మండలం రిపోర్టర్ (శుభోదయం న్యూస్):



వికారాబాద్ జిల్లా దోమ మండల పరిధిలోని మోత్కూర్ గ్రామానికి చెందిన గణపురం నర్సింలు అనారోగ్యంతో బాధపడుతున్నారని విషయం తెలుసుకుని ఇంటికి వెళ్లి పరామర్శించి హాస్పిటల్ తక్షణ అవసరాల ఖర్చుల నిమిత్తం కొరకై 5,000/- వేల రూపాయలు ఆర్థిక సహాయం అందించారు.ఈ కార్యక్రమంలో ముదిరాజ్ సంఘం అధ్యక్షుడు కొత్తపేట రాఘవేందర్, యాదయ్య, నగేష్, కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

## చలో కొండాయపల్లి

**డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ విగ్రహిష్కరణ విజయవంతం చేద్దాం**

పరిగి మండలం రిపోర్టర్ (శుభోదయం న్యూస్):



ఈరోజు చౌడపూర్ మండల కేంద్రంలో కొండాయిపల్లి డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ విగ్రహావిష్కరణ అంబేద్కర్ యువజనసంఘాలు మరియు ఎమ్మార్పీఎస్ చౌడపూర్ కేంద్రంలో వాలు పోస్టర్ రిలీజ్ చేయడం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఏసిఎఫ్ వ్యవస్థాపక అధ్యక్షులు, తుప్పల అశోక్ తెలంగాణ పంచాయతీ రాజ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మందిపాల్ వెంకట్, ఉద్యోగ సంఘాల తాలూకా అధ్యక్షులు దాసరి కరుణాకర్, చౌడాపూర్ మండలం అంబేద్కర్ సంఘాల అధ్యక్షులు పరిగి అశోక్, కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు ఎల్పటి అశోక్ కుమార్, చౌడాపూర్ మండల ఎమ్మార్పీఎస్ అధ్యక్షులు మొగులయ్య, తాలూకా అంబేద్కర్ సంఘాల నాయకులు సురేష్, మండలం అంబేద్కర్ సంఘాల ప్రధాన కార్యదర్శి కోస్గి కుమార్, బిఆర్ఎస్ పార్టీ యువ నాయకులు మఠం రాజశేఖర్, అంబేద్కర్ మండల నాయకులు మాజీ సర్పంచ్ చెన్నయ్య, మంది పాల్ ఎమ్మార్పీఎస్ అధ్యక్షులు మొగులయ్య, కాంగ్రెస్ పార్టీ యువ నాయకులు కావాలి గోపాల్, దండు నరేష్, హనుమంతు, పరిగి రాములు, యువ నాయకులు గోరుపల్లి సత్తయ్య, చౌడపూర్ గ్రామ కమిటీ అంబేద్కర్ సంఘం ఉపాధ్యక్షులు భరత్ కుమార్, యువజన సంఘాల నాయకులు ప్రభు, శివకుమార్, బన్నీ, నర్సింలు, కుమార్, రాజు, యాదయ్య, యువ నాయకులు మహేష్, పాల రాజశేఖర్, యాదయ్య, శ్రీనివాస్, నందు, ఈ కార్యక్రమంలో పాల్గొనడం జరిగింది..

# అంగన్వాడీలను అరెస్టు చేయడం దారుణం

**సిఐటియు జిల్లా అధ్యక్షురాలు బాలమణి**

రామాయంపేట (శుభోదయం న్యూస్) సెప్టెంబర్ 25:

సిఐటియు జిల్లా అధ్యక్షురాలు బాలమణి నేతృత్వంలో గురువారం నాడు సుమారు 50 మంది అంగన్వాడి ఉద్యోగులు రామాయంపేట నుండి హైదరాబాదుకు తరలివెళ్లారు.సెక్రటేరియట్ కు వెళ్లకముందే పోలీసులు వీరిని అరెస్టు చేసి ముషీరాబాద్ పోలీస్ స్టేషన్ కు తరలించారు.ఈ సందర్భంగా సిఐటియు జిల్లా అధ్యక్షురాలు బాలమణి ఫోన్ లో మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ఐసిడిఎస్ తో పాటు విద్యా వ్యవస్థను పూర్తిగా నిర్వీర్యం చేయడం కోసం నూతన జాతీయ విద్యా విధానం చట్టాన్ని తెచ్చిందని ఆగ్రహం వ్యక్తం చేశారు.ఇంతటి ప్రమాదకరమైన విధానాలకు వ్యతిరేకంగా నిలబడాల్సిన బాధ్యత రాష్ట్ర ప్రభుత్వంపై ఉండగా,దీనికి భిన్నంగా ఐసిడిఎస్ ను మొత్తం నిర్వీర్యం చేసే కుట్రలో పాలు పంచుకుంటుందని ఆరోపించారు.ఇందులో భాగంగా ప్రీ ప్రైమరీ,పి.ఎం. శ్రీవిద్య పేరుతో 5 సంవత్సరాల లోపు పిల్లలను విద్యాశాఖకు అప్పగిస్తూ నిర్ణయం చేసిందన్నారు. కాంగ్రెస్ అధికారంలో ఉన్న కర్నాటక రాష్ట్రంలో ప్రీ ప్రైమరీ ఐసిడిఎస్ కే ఇచ్చారని,పక్కనున్న ఆంధ్రప్రదేశ్ లో కూడా ప్రీ ప్రైమరీ ఐసిడిఎస్ కే ఇచ్చారని గుర్తు చేశారు.దేశవ్యాప్తంగా ప్రీ ప్రైమరీ అమలు చేయాలనుకున్న అన్ని చోట్ల ఐసిడిఎస్ కే ఇచ్చారని, తెలంగాణ ప్రభుత్వం దీనికి భిన్నంగా వ్యవహరించడం సరైనది కాదన్నారు.ప్రీ ప్రైమరీ, పి.ఎం. శ్రీవిద్యను అంగన్వాడీ కేంద్రాల్లోనే నిర్వహించాలని,విద్యా బోధనా బాధ్యతను అంగన్వాడీ టీచర్స్,హెల్పర్స్కు ఇవ్వాలని డిమాండ్ చేశారు.అందుకు అనుగుణంగా అంగన్వాడీ ఉద్యోగులకు అదనపు వేతనం చెల్లించాలన్నారు.దీంతో పాటు అంగన్వాడీలకు తప్పనిసరి చేసిన ఫేస్ క్యాప్చర్ (ఎఫ్.ఆర్.ఎస్) విధానాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం ఇచ్చిన సెల్ ఫోన్ లు పని చేయటం లేదని,ఫేస్



క్యాప్చర్ కావట్లేదన్నారు.ఎఫ్ఆర్ఎస్ కు పోషకాహారానికి లింక్ పెట్టడం వల్ల చాలామంది పేదలు నష్టపోతున్నారని గుర్తు చేశారు. అంగన్వాడీ ఉద్యోగులు రాష్ట్రంలో సుదీర్ఘకాలంగా పోరాడుతున్నారని 2023 సెప్టెంబర్,అక్టోబర్ నెలల్లో 24 రోజులు నిరవధిక సమ్మె చేయగా,గత ప్రభుత్వం అనేక హామీలు ఇచ్చిందన్నారు. ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం కూడా అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా అంగన్వాడీ టీచర్స్,హెల్పర్స్ కు అనేక హామీలు ఇచ్చారని గుర్తు చేశారు.కాంగ్రెస్ మేనిఫెస్టోలో రూ.18,000/- రూపాయల వేతనం చెల్లిస్తామని పిఎఫ్ సౌకర్యం కల్పిస్తామని హామీ ఇచ్చారన్నారు.ఎన్నికల అనంతరం ప్రస్తుత ప్రభుత్వం ఇచ్చిన హామీలు అమలు చేయాలన్నారు.అనేకసార్లు రాష్ట్ర ప్రభుత్వానికి పలుమార్లు విజ్ఞప్తులు చేసిన కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు పట్టించుకోవడం లేదన్నారు.పైగా ఐసిడిఎస్ ను నిర్వీర్యం చేసి పేద ప్రజలతో పాటు అంగన్వాడీ ఉద్యోగులకు నష్టం కల్గించే చర్యలు చేపట్టడం మరింత బాధాకరమన్నారు. ఈ విధానాల వల్ల రాష్ట్ర వ్యాప్తంగా అంగన్వాడీ టీచర్స్,హెల్పర్స్ తీవ్రమైన ఆందోళనకు గురవుతున్నారని వారిని కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు ఆదుకోవాలని డిమాండ్ చేశారు.అరెస్టు అయిన వారిలో అంగన్వాడీల ప్రాజెక్టు అధ్యక్షురాలు మంగ,కార్యదర్శి పద్మ,శ్యామల,ఉపాధ్యక్షులు శోభ,రాధ,రాణి,అంగన్వాడి ఉద్యోగులు దేవలక్ష్మి,పద్మ తో పాటు పలువురు పాల్గొన్నారు.

# జ్యోతి క్షేత్రాన్ని ఆధ్యాత్మిక కేంద్రంగా అభివృద్ధి చేయాలి

సిద్ధవట మండల విలేకరి జాకీర్ హుస్సేన్( శుభోదయం న్యూస్)



ప్రపంచ పర్యాటక దినోత్సవం ఈనెల 27వ తేదీ ని పురస్కరించుకొని ముంద స్తుగా శ్రీశైలంకి దక్షిణ ద్వారంగా ప్రసిద్ధిగాంచిన పురాతన క్షేత్రం జ్యోతి క్షేత్రాన్ని దక్షిణ భారత పర్యాటక సంస్థ ఆధ్వర్యంలో సందర్శించడం జరిగింది. ఈ సంద ర్భంగా సంస్థ గౌరవ అధ్య క్షులు సట్టిభారవి మాట్లాడుతూ మహిమాన్వితమైన జ్యోతి క్షేత్రం పట్ల శ్రీశైల దేవస్థానం సంబంధిత అధికారులు శ్రద్ధ వహించాల్సిన అవసరం ఎంతైనా ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. గతంలో ఈవోగా పనిచేసిన లవన్న రెండేళ్ల క్రితం జ్యోతి క్షేత్రాన్ని దర్శించి సంబంధిత అధికారులతో ప్రెస్ మీట్ నిర్వహిం చి నాలుగు కోట్లతో జ్యోతి దేవా నక్షత్రాన్ని అభివృద్ధి పరుస్తామని పత్రికాముఖంగా తెలియజేశారు. తర్వాత ఈ క్షేత్రంపై వారు సీత కన్ను వేయడం కడప జిల్లాలో ఉన్నటువంటి భక్తులను, పర్యాటకులను ఎంతో ఆవేదన గురిచేసింది. ఈ క్షేత్రానికి 100 ఎకరాల మాన్య భూములు పరాధీనమై పాలన పాలన లేక శిథిలావస్థకు చేరుకున్నాయ్. ఇప్పటికైనా శ్రీశైలం దేవస్థానం సంబంధిత అధికారులు యుద్ధ ప్రాతిపదికన జ్యోతి క్షేత్ర అభివృద్ధికి నిధులు కేటాయించి పునర్వైభ వానికి సహకరించాలని కమిటీ సభ్యులు తెలియజేశారు. రాష్ట్ర ప్రభుత్వం సగజ సిద్ధమైనటువంటి జ్యోతి క్షేత్రం పెన్నా నది పరివాహక ప్రాంతంలో ఉండడం ప్రకృతి రమణీయతకు, ఆహ్లాదకర వాతావరణానికి ఆధ్యాత్మిక కేంద్రంగానూ, పర్యాటకంగానూ సుధూర ప్రాంతాల నుండి ఎంతోమంది ఆకర్షించగలరని తద్వారా రాష్ట్ర ఆదాయం గణనీయంగా పెరుగుతుందని, ఇలాంటి వందల ఏళ్ల వారసత్వ సంపదను కాపాడాల్సిన బాధ్యత దేవాదాయ శాఖ మరియు రాష్ట్ర ప్రభుత్వంపై ఎంతైనా ఉంది. ఒంటిమిట్ట చెరువులో ప్రతిష్టాత్మకమైన శ్రీరామచంద్రుల యొక్క 600 అడుగుల విగ్రహాన్ని రూపొందించాలని టిటిడి అధికారులు ముందుకు రావడం హర్షించదగ్గ విషయమని తెలిపారు. ఈ ప్రాంతంలో రాణి రుద్రమదేవి జ్యోతి సిద్దేశ్వర స్వామిని ఇంటిదేవునిగా పూజించి ఈ క్షేత్రానికి వెండి రథాన్ని, బహుకరించినట్లు ఆధారాలు ఉన్నాయి. ప్రధాన కూడలిలో రాణి రుద్రమదేవి యొక్క విగ్రహ ప్రతిష్ట చేయాల్సిన అవసరం ఎంతైనా ఉంది. ఈ కార్యక్రమంలో సంస్థ అధ్యక్షులు జ్యోతి జార్జి, కార్యదర్శి శ్రీనివాసులు, ఆది మహాలక్ష్మి దేవాలయం అధ్యక్షులు మల్లికార్జున రెడ్డి, శ్రీ జగన్నాథ మారెమ్మ దేవాలయ ధర్మకర్త సట్టి భాస్కర, వరప్రసాద్, స్థానిక శైవ భక్తులు, వ్యవస్థాపక అధ్యక్షులు, శ్రీ పుష్పగిరి తీర్థ క్షేత్ర ధర్మ పరిరక్షణ సమితి, కడప జిల్లా తదితరులు పాల్గొన్నారు.

## దీన్ దయాళ్ ఉపాధ్యాయ జన్మదినం యువజ్యోతి మొక్కలు నాటే కార్యక్రమం

రామాయంపేట (శుభోదయం న్యూస్) సెప్టెంబర్ 25:-




దీన్ దయాళ్ ఉపాధ్యాయ జన్మదినం సందర్భంగా మై భారత్ యువ భారత్ రామాయంపేట యువ జ్యోతి ఆధ్వర్యంలో గురువారం నాడు మొక్కలు నాటే కార్యక్రమం చేపట్టారు.ఈ సందర్భంగా రావి మరియు తులసి మొక్కలను జూనియర్ కళాశాల మైదానంలో యువజ్యోతి కోఆర్డినేటర్ సత్యనారాయణ ఆధ్వర్యంలో జ్యోతి స్పోర్ట్స్ క్లబ్ ఫుట్బాల్ మరియు క్రీడాకారులు నాటారు.ఈ సందర్భంగా యువజ్యోతి కోఆర్డినేటర్ సత్యనారాయణ మాట్లాడుతూ ఏకాకృత పాలన ప్రజల ఐకమత్యం కోసం పోరాటం చేయడమే కాకుండా తన ప్రాణాలను కూడా లెక్కచేయకుండా త్యాగం చేసి మరణాంతరం కూడా జీవించిన విశ్వమానవుడని ఆయన అడుగుజాడల్లో అందరు నడవాలని కోరారు.ఈ కార్యక్రమంలో అభిరామ్ శశి మహేష్ చందు మనోజ్ కుమార్ లడ్డు విష్ణు తదితరులు పాల్గొన్నారు.

## భవితకు భరోసా కల్పించడంలో విద్యాశాఖ ప్రత్యేక దృష్టి

నల్లచెరువు, మండలం రిపోర్టర్ - మాలిక్ బాషా, సెప్టెంబర్ 25(శుభోదయం న్యూస్) :



పాఠశాల స్థాయి నుండి విద్యార్థులలో స్వయం ఉపాధి వృత్తి విద్యా కోర్సులలో శిక్షణ ఇస్తూ విద్యార్థుల భవితకు భరోసా కల్పించడంలో రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ వహిస్తోంది.9వ తరగతి నుంచి 12వ తరగతి వరకు విద్యార్థులకు ప్రతి పాఠశాలలో ఆటోమోటివ్,ఎలక్ట్రానిక్స్ వంటి విభాగాల్లో విద్యార్థులలో ఆచరణాత్మక పరిజ్ఞానం పెంపొందించేందుకు శిక్షణ కార్యక్రమాలను నిర్వహిస్తోంది. ఇందులో భాగంగా నల్లచెరువు మండలం పరిధిలోని దేవిరెడ్డి పల్లి ఆదర్శ పాఠశాలలో 10,11,12వ తరగతులు చదువుతున్న విద్యార్థులకు పాఠ్యాంశాలతో పాటు వృత్తి విద్యా కోర్సులు కూడా బోధిస్తూ విద్యార్థుల భవితకు భరోసా కల్పిస్తున్నారు. ఇందులో భాగంగా ఆటోమోటివ్ రంగాన్ని ఎంపిక చేసుకున్న విద్యార్థులకు ఏడాదిలో మూడుసార్లు ఇంటర్న షిప్ కార్యక్రమాన్ని నిర్వహిస్తారు.దసరా సెలవుల ఇంటర్న షిప్ కార్యక్రమం కదిరిలోని పలు ఆటోమొబైల్స్ రంగంలో విద్యార్థులకు శిక్షణ ఇప్పిస్తున్నారు.కదిరి పట్టణంలోని యమహా, హోండా టీవీఎస్,హీరో వంటి ప్రముఖ షోరూములలో విద్యార్థులకు సేల్స్ సర్వీసెస్, స్పేర్ పార్ట్స్ వంటి వాటిపై ప్రత్యేక శిక్షణ అందిస్తున్నారు. ముఖ్యంగా ఆడపిల్లలు ఎక్కువ సంఖ్యలో ఈ ఇంటర్న షిప్ కార్యక్రమంలో పాల్గొని ఆటోమొబైల్స్ రంగంలో రాణించడం హర్షించదగ్గ విషయమని విద్యార్థుల తల్లిదండ్రులు తమ ఆనందాన్ని వ్యక్తం చేస్తున్నారు. ఇందులో భాగంగా గురువారం జరిగిన శిక్షణ కార్యక్రమాన్ని జి.సి.డి. ఓ.ఎం.సంపూర్ణ,ఒకేషనల్ కోఆర్డినేటర్ మధు మనోహర్, కృష్ణ చైతన్యలు పర్యవేక్షించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థులకు విద్య కోర్సుల పట్ల ప్రత్యేక శ్రద్ధ వహించి ముందుకు తీసుకెళుతున్న ఒకేషనల్ ట్రైనర్ సల్మాను అభినందించారు.వృత్తి విద్యా కోర్సుల వల్ల భవిష్యత్తులో విద్యార్థులకు ఉపాధికి మంచి అవకాశాలు కలుగుతాయన్నారు.నైపుణ్య అభివృద్ధికి ఈ శిక్షణ ఎంతగానో దోహదపడుతుందన్నారు. విద్యార్థులకు చదువు పూర్తి అయ్యేసరికి శిక్షణతో కూడిన ధ్రువ పత్రాలు అందివ్వడం జరుగుతుందన్నారు.ఈ ధ్రువపత్రాలు భవిష్యత్తుతో విద్యార్థులకు ఉపాధికల్పనలో ఎంతగానో దోహదపడతాయని పేర్కొన్నారు.కార్యక్రమంలో జి.సి.డి.ఓ.ఎం సంపూర్ణ, ఒకేషనల్ కోఆర్డినేటర్ మధు మనోహర్,కృష్ణ చైతన్య విద్యార్థిని విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## సింగూరు ప్రాజెక్టులోకి భారీగా వరద... 9 గేట్లు ఎత్తివేత

సంగారెడ్డి జిల్లా ప్రతినిధి అనిల్ (శుభోదయం న్యూస్ )



సింగూరు రిజర్వాయర్ కు భారీగా వరద పోటెత్తింది. గురువారం నాడు మధ్యాహ్నం రెండు గంటలకు మరో గేటు ఎత్తి 9 గేట్ల ద్వారా దిగువకు 75,251 క్యూసెక్కులు వరద నాగరాజు తెలిపారు. ఎగువ ప్రాంతం నుంచి 71.450 చెక్కులు వరద సింగూరు ప్రాజెక్టులో చేరుతున్నట్లు చెప్పారు. ఈ సీజన్లో ప్రాజెక్ట్ ద్వారా 9 గేట్లు ఓపెన్ చేయడం ఇదే మొదటిసారి అని పేర్కొన్నారు.

## రాష్ట్ర అడ్వైజర్ షరీఫ్ ని మర్యాదపూర్వకంగా కలిసిన రాష్ట్ర డైరెక్టర్ డాక్టర్ వీరభద్రుడు


సిద్ధవటం మండల విలేకరి జాకీర్ హుస్సేన్( శుభోదయం న్యూస్):




మాజీ శాసనమండలి చైర్మన్, ఎమ్మెల్సీ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముస్లిం మైనారిటీ అఫైర్స్ అడ్వైజర్, గౌరవనీయులు, పెద్దలు శ్రీ మహమ్మద్ షరీఫ్ గారిని, ఇటీవల రాష్ట్ర నూర్ భాషా దూదేకుల వెల్ఫేర్ అండ్ ఫైనాన్స్ కార్పొరేషన్ డైరెక్టర్ గా నియమితులైన డాక్టర్ నాగూరు వీరభద్రుడు గారు మంగళగిరి లోని తెలుగుదేశంపార్టీ కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిసి దుస్సాలువా కప్పి ధన్యవాదాలు తెలియజేసు కున్నారు. ఈ సందర్భంగా షరీఫ్ గారు మాట్లాడుతూ పదవి ఇచ్చిన పార్టీకి సేవ చేస్తూ, కార్పొరేషన్ ద్వారా క్యాస్ట్ ను రాష్ట్రంలో తిరుగులేని శక్తిగా తయారు చేయవలసిందిగా సూచించారు. ఈ సందర్భంగా వీరభద్రుడు మాట్లాడుతూ తనపై నమ్మకం ఉంచి డైరెక్టర్ పదవిని ఇచ్చిన రాష్ట్ర ముఖ్యమంత్రివర్యులు నారా చంద్రబాబు నాయుడు గారికి ధన్యవాదాలు తెలియజేస్తూ, తమ వంటి పెద్దల ఆశీర్వాదాలు మాకు ఎల్లవేళలా ఉండాలని షరీఫ్ గారిని కోరుకున్నారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ నాగూరు వీరభద్రుడు గారి అనుచరులు స్టేట్ మైనార్టీ సెక్రటరీ షేక్ ఖాదర్బాషా, మాధవరం-1 టీడీపీ యువ నాయకులు పెగడ హరి ప్రసాద్, మామిళ్ళ మురళి రాయల్, మామిళ్ళ వెంకటేష్ రాయల్, బొగ్గడివారిపల్లి గ్రామ కమిటీ కార్యదర్శి రాజేంద్ర ప్రసాద్ రెడ్డి లు పాల్గొన్నారు.

## పార్టీలకు అతీతంగా సంక్షేమ పథకాలను అందిస్తున్నాం ఎమ్మెల్యే రేవూరి ప్రకాష్ రెడ్డి

తెలంగాణ స్టేట్ బ్యూరో కడిదల రామారావు (శుభోదయం న్యూస్):



పేద ప్రజలకు అండగా ముఖ్యమంత్రి సహాయ నిధి పథకం నిలుస్తుంది పరకాల పట్టణ కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం నందు ఆత్మకూరు, దామెర, నడికూడా, పరకాల టౌన్ మండలాలకు చెందిన అర్హులైన 70 మంది లబ్ధిదారులకు 20 లక్షల 50వేల రూపాయల చెక్కులను పరకాల శాసనసభ్యులు రేవూరి ప్రకాశ్ రెడ్డి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పేద ప్రజలకు అండగా ముఖ్యమంత్రి సహాయనిధి పథకం నిలుస్తుందని, పార్టీలకతీతంగా సంక్షేమ పథకాలు అందిస్తున్నామని అన్నారు. బడుగు బలహీన వర్గాల సంక్షేమమే లక్ష్యంగా కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం కృషి చేస్తోందని, సీఎంఆర్ఎఫ్ ద్వారా ఎందరో నిరుపేదల ప్రజల ప్రాణాలు నిలబడుతున్నాయన్నారు ప్రతి కుటుంబం ఆర్థికంగా ఎదగడమే తమ ప్రభుత్వ లక్ష్యం అన్నారు గత ప్రభుత్వంలో లబ్ధిదారులకు కనీసం సీఎంఆర్ఎఫ్ నిధులు కూడా ఇవ్వలేదని, కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక పెండింగ్ వాటిని కూడా మంజూరు చేసామన్నారు.అలాగే 200 యూనిట్ల ఉచిత కరెంట్, 500 రూ గ్యాస్ సిలిండర్, రైతు రుణమాఫీ, ఇందిరమ్మ ఇల్లు, కొత్త రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా ఇలా చెప్పుకుంటూ పోతే ఎన్నో పథకాలు అర్హులైన ప్రతి ఒక్కరికి చేరే విధంగా ప్రజా ప్రభుత్వం కృషి చేస్తుందని అన్నారు.

## నూతన ఎస్పీని మర్యాదపూర్వకంగా కలిసిన కుప్పాల వెంకటసుబ్బయ్య

సిద్ధవటం మండల విలేకరి జాకీర్ హుస్సేన్( శుభోదయం న్యూస్):

కడప జిల్లాకు నూతన ఎస్పీగా పదవి బాధ్యతలు చేపట్టిన ఎస్.పి శ్రీ షెల్కే నచికేత్ విశ్వనాథ్ ఐ.పి.ఎస్ గారిని రాష్ట్ర పంచాయతీ రాజ్ ఛాంబర్ ఆర్గనైజింగ్ సెక్రటరీ కుప్పాల వెంకటసుబ్బయ్య ఎస్పి కార్యాలయం నందు మర్యాదపూర్వకంగా కలిసి పూల బొకే శాలువా తో ఘనంగా సన్మానించారు.

